
# ఆంధ్రభూమి



# 1948 జనవరి 2వ తేదీన ఆంధ్రదేశమంతటా విడుదలైంది!

ఆ నిలువు వయస్సుకత్తెకూ ఆ పసికందుకూ యేమిటో సంబంధం! ఆమె కన్నవారికీ—ఆమె కన్నులగన్న వారికీ
ఆయిద్దరూ తల్లీ కొడుకులు— అయితే, ఆమె భర్తయెవరు? ఆ కందును కన్నవారికే తెలియాలి ఆ సత్యం!
బ్రతుకు లోతెరుగని లోకం ఆమెను నిరాదరించింది— బ్రతికి తనిసిన వృద్ధదంపతు లామెను
ఆదరించారు— వారెవరో— నిజం తెలిసిన దేవతలేమో— చూడండి



★

దర్శకుడు

రామకృష్ణ

★

భానుమతి,
డా॥ సుబ్బారావు
సి. ఎస్. ఆర్
నాగేశ్వరరావు,
ఆరణి,
సూర్యనారాయణ,
బేబీ సుమిత్ర,
సీతారాం,

మొదలైనవారు

★

రచన

సముద్రాల

★

సంగీతం

సుబ్బరామన్

★

స్టూడియో

న్యూటోన్

★

## భరణీ వారి

# రత్నమాల

నిర్మాతలు
భరణీపిక్చర్సు
మద్రాసు-17.

పూర్ణా పిక్చర్సు వారి విడుదల

# ఆంధ్రశిల్పి

## సచిత్ర మాస పత్రిక


సంపాదకులు

శ్రీ గణపతి శాస్త్రి: శ్రీ సాంబశివ రావు



౧౦, నరసింగపురం వీధి,

మౌంట్ రోడ్, మద్రాసు.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | | పుట. |
| సంపాదక సమీక్షలు ... ... | సంపాదకులు | ౩ |
| ఆహ్వానము ... ... | శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి గారు | ౫ |
| పోటునాడు ... ... | శ్రీ రమణారెడ్డి గారు | ౬ |
| వ్రత సీర ... ... | శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి గారు | ౭ |
| ముని మాణిక్యం ... ... | శ్రీ ఉన్నవ గోపాలకృష్ణ గోఖలే గారు | ౯ |
| చిత్రజగత్ ... ... | శ్రీ "విశాఖ" గారు | ౧౩ |
| మనిషి ఖరీదు ... ... | శ్రీ అనిసెట్టి సుబ్బారావు గారు | ౧౭ |
| ప్రకృతి శిల్పి భగీరథ ... ... | శ్రీ సంజీవదేవ్ గారు | ౨౫ |
| చెప్పని సందేశం ... ... | శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు గారు | ౩౧ |
| తిరువాన్కూరు కుడ్య చిత్రాలు | శ్రీ కె. పి. పద్మనాభన్ తంపి. బి. ఏ. గారు | ౪౧ |
| గ్రంథ విమర్శనము ... ... | ... ... ... | ౫౧ |


## శిల్పాలు


త్రివర్ణ చిత్రము ... ... బందరు కలంకారీ అద్దకాలు

తిరువాన్కూరు కుడ్య చిత్రాలు


## గమనిక

వ్యాసాలు పంపేవారు విడివిడిగా ఒకేవైపున వ్రాసి పంపాలి. అవి తిరిగి కావలసినా, సమాధానాలు కావలసినా తపాలావ్యయం వ్యాసకర్తలే భరించాలి. వ్యాసకర్తల ఆశయాలకు సంపాదకులు బాధ్యులు కారు. విమర్శనార్థం పుస్తకాలు పంపేవారు రెండేసి కాపీలు పంపాలి.

సంపాదకులు.



బందరు కలంకారీ అద్దకం

సంపుటి ౨

# ఆంధ్రశిల్పి

సంచిక ౬

# సంపాదక సమీక్షలు

## వీరేశలింగ వర్ధంతి

వీరేశలింగ శత వార్షిక వర్ధంతి త్వరలో రాబోతూంది మద్రాసులోను, రాజమహేంద్రవరంలోను ఈ వర్ధంతి ప్రయత్నాలు సంగ్రహంగా జరుగుతున్నాయని వింటున్నాము.

ఈనాడు ఆంధ్రదేశం సాంఘికంగా గాని, రాజకీయంగా గాని, సాంస్కృతికంగా గాని, వాఙ్మయరూపంగా గాని, ఏదైనా ముందడుగు వేసిందంటే అది ఆ మహామహుని అంకురార్పణ వల్లనే. ఈనాడు మనం ఏ శాఖలోనైనా అడుగున పడి ఉన్నామంటే అది ఆయన దివ్య సందేశం ఇంకా ఆచరణలో అవలంబించక పోవడం వల్లనే.

సాంఘికంగా ఆయన ఆదర్శాలు సర్వులూ అంగీకరిస్తున్నారు. కాని ఆయన ఆదర్శ శిఖరాలు ఇంకా అందుకోవలసే ఉన్నాయి. వాఙ్మయ రంగంలో నాడే వ్యావహారిక భాషా వాదం, వీరేశలింగం అంగీకరించాడు. కాని అది నేటి వరకూ, ప్రభుత్వానికీ, విశ్వవిద్యాలయానికీ మాలకాకిగానే ఉండి పోయింది. ఇల్లాగే ఆయన ఆదర్శాలు అనేక శాఖల్లో మనకి అందరానివిగానే ఉన్నాయి. నూరు సంవత్సరాల నించీ ఆయన చైతన్యశక్తి మనలో ప్రవహిస్తూనే ఉంది! కాని అది క్రమంగా సన్నగిల్లి మనం ఆయన్ని మరిచి పోయాము.

ఈ మాట కొందరికి అతిశయోక్తిగా కనబడవచ్చును గాని, ఇది అక్షరాలా నిజం! దీనికి రుజువు కావలిస్తే ఒకసారి రాజమహేంద్రవరం వెళ్లి వీరేశలింగ సంస్థలన్నీ పరిశీలిస్తే తెలుస్తుంది.

వారు స్థాపించిన హైస్కూలు ఒకవైపు నించి శిఖస్తు పడి మీద పడేటట్లు ఉంది. దీని పరిపాలన విషయంలో అనేక వాదోపవాదాలు, స్పర్థలు పెరిగి, కక్షలు బయలుదేరినాయి. కోర్టులలో కెక్కిన ఆ వ్యవహారాలు అయిదారేళ్లనించీ అల్లాగే ఉన్నట్లు కనబడుతుంది. వితంతు శరణాలయం తోట

మొదలైనవన్నీ అస్తవ్యస్తంగా పడున్నాయి. ఆఖరుకి ఆయన ప్రతిమకూడా సరియైన సంరక్షణలేక దిక్కు మాలినట్లు కనిపిస్తూంటుంది. ఆ విగ్రహంకేసి చూస్తూంటే భగ్నమైన తన ప్రయత్నాలన్నీ ఆ మూర్తి భావిస్తూన్నట్లు కనబడుతుంది.

వీరేశలింగ సంపుటాలు చాలా వరకు అలభ్యంగా ఉన్నాయి. వాటిని ఎవరైనా మరి ముద్రిస్తే ఎన్నయినా ఖర్చు పడతాయి. వారు రాజమహేంద్రపురానికిచ్చిన పురమందిరం కూడా ఇంచుమించుగా శిథిలావస్థలోనే ఉన్నట్లు కనబడుతుంది. ఇది అంతా వీరేశలింగ విస్మరణ కాక మరేమిటి!

వీరేశలింగ విస్మరణ, ఆంధ్రజాతికి అధఃపతనమేగాని, ఆ మహామహుని యశశ్శరీరానికి అణుమాత్రంచేత లోటుకాదు. ఇది ఆంధ్రజాతి ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదని భావిస్తున్నాము.

ప్రస్తుతం మద్రాసులోను, రాజమహేంద్రవరంలోను, వర్ధంతి జరపడానికి ప్రయత్నించే వారికి మా అభివందనాలు. కాని ఈ ప్రయత్నాలు ఇంకా బాగా మహోన్నత కక్ష్యలో జరగాలి. ప్రతి పల్లెలోను, పట్టణంలోను ఆబాల గోపాలము ఆ మహామహుని వర్ధంతి జరపాలి. ప్రభుత్వము ప్రజలు అందరు ఈ విషయంలో ముందడుగు వెయ్యాలి. వారి సంపుటాల్లో ముఖ్యమైన కొన్ని రచనలు సేకరించి ప్రత్యేక సంపుటంగా వెయ్యాలని ఆలోచిస్తూన్నట్లు వింటున్నాము. ఆ అభిప్రాయం హర్షించ దగినదే! కాని వీరేశలింగ సంపుటాలన్నీ పునర్ముద్రితం కావాలి. రాజమహేంద్రవరంలో ఉన్నత పాఠశాల కళాశాలగా మారాలి. వీరేశలింగ సంస్థలన్నీ అఖిలాంధ్రలో ఉన్న పెద్దల పర్యవేక్షణలోకి రావాలి. ఈ సమయంలో ఆంధ్రదేశమంతా ఏకోన్ముఖమై, వీరేశలింగ వస్తు ప్రదర్శనశాల స్థాపించి, దాన్ని ఆంధ్రదేశానికంతటికీ సంస్కృతి క్షేత్రంగా మార్చాలి.

కేవలం రాజమహేంద్రవరంలోను మద్రాసులోను, ఉండే పెద్దలేకాక, అఖిలాంధ్రంలో ఉండే, సాహితీ పరులు, సంఘసేవకులు, రాజకీయ నాయకులు, కలిసి ఈ ఉత్సవానికి ఆహ్వానసంఘం ఏర్పరచి ఈ ఉత్సవం ఆంధ్రదేశమంతా మారు మోగేటట్లు చెయ్యాలి. మళ్ళీ వీరేశలింగ శంఖారావం అందరికీ వినిపించి ప్రజాసామాన్యానికి చైతన్యం కలిగించాలి.

ఆంధ్రుల్లో అందరూ, ఈ ఉత్సవానికి మన జాతి అభ్యుదయానికీ ఉన్న సన్నిహిత సంబంధం గుర్తించి, దీన్ని విజయవంతంగా కొనసాగించడానికి తగిన ప్రయత్నాలన్నీ చేస్తారని భావిస్తున్నాము.

# ఆహ్వానము

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి

( సాహితీ సమితి )

రార సఖుడా!
ఆడు కొందాం
ఆడు కొందాం రార సఖుడా!
కల్ప వృక్షపు నీడ లందున
రార సఖుడా!
పాడు కొందాం
పాడు కొందాం రార సఖుడా!
కీచ కమ్ములు తోడు రాగా
రార సఖుడా!
వేడు కొందాం!
వేడు కొందాం రార చెలుడా!
దివిజ లోకము తేజరిల్లగ
రార ప్రియుడా!
వెడలి పోదాం!
వెడలి పోదాం రార ప్రియుడా!
వేడుకలతో కదలి రారా
రార ప్రియుడా!

రార ప్రియుడా!
ఎదురు చూచెటి దాన నేనే!
మది తలంచవ ఆట పాటల
నీ దినమ్మున సైత మావిధి
రార ప్రియుడా!
రార చెలుడా!
మావి గున్నలు పూల దాల్పగ,
మాధవీ లత పొందు గూర్చెను!
రార సఖుడా!
రార సఖుడా!
మాలతీ మధు మాల లల్లి
సేకరించితి నిన్ను గొల్వగ
రార చెలుడా!
రార చెలుడా!
రామణీయత లుట్టి పడగా
రార చెలుడా! వేగ రారా!

# పోటు నాడు

శ్రీ రమణారెడ్డి

ఈ సుధా క్షీరమ్ము త్రావనా ?
త్రాగుతూ త్రాగుతూ
అల వూయెలైన నే నూగనా ?
ఊగుతూ ఊగుతూ,
శోభ మధురసమేను గ్రోలనా ?
త్రాగుళ్ళ, ఊగుళ్ళ, దినరాత్రములు
యిందే ఆగనా ?
ఆనంద మున చొక్కి తూగనా ?
తీరాన నిలువునా
చిరు గాలి కెగిరినా
అల పిల్ల
తెల తెల్ల మల్లెపూవంచు చెంగును నేను
లాగనా ?
అందానితో పొందు –
చందాలతో చిందు –
తీయందనాలతో తనివి తరుగని విందు
ఈశోభ కందు నిట, నేనందు నిచటనే !
దిన రాత్రములు యిందె ఆగనా ?
ఆనంద మున చొక్కి తూగనా ?
ఆవాస మియ్యదే,
సావాస మియ్యదే
భ్రాతృ స్పర్థలలోక మొద్దురా,
మాతృ క్షోభను కాంచజాలరా !
తిరిగి వచ్చే అలల విరిగి కలగిన కలలు –
ఒరిగి వచ్చే అలల పెరిగి మరిగే కలలు –

అల కలల కలకలములో,
వలి గాడ్పు వీవనలలో,
దిన రాత్రములు ఇందె మసలనా?
ఆనంద వారాశి మునుగనా ?
మధుర మోహన గాన మాలపించేనా ?
దిగ్దిగంతాలకో,
చుక్క తెలి చుక్కలకో,
ఏచటికో ఏటికో యెగసి పర్వేనా ?
ఎంత త్రాగిన కనులు ఇంక కావలె ననును,
ఈతనివి నార్పుటకు ఒయసిస్సు లెచటనో ?
వెనుక గలనో లేనో ?
బ్రతుక గలనో లేనో ?
చిదికి పోవునో పూవు ?
విశ్వమ్ము నాది ఈసౌందర్యమే నాది!
విశ్వమ్ము నేను సౌందర్యమ్ము నే నేను !
జగతితో పుట్టుదును,
జగతిలో గిట్టుదను !
నేన సౌందర్యాన్ని,
సౌకుమార్యాన్ని నేనే !
నేన సౌరభ్యాన్ని,
సొగసు నే నేను !
నేన సుకుమారాన్ని,
సరస సల్లాపాలు నేనే !
భోగాలు సిరులు సంపదలన్ని నేనే !
విశ్వమ్ము నాది ఈసౌందర్యమే నాది –
విశ్వమ్ము నేను సౌందర్యమ్ము నే నేను !

# ప్రతిసీర

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

వ్యోమమునంటు అగ్రమున నున్న మహాలయ సీమ జేరగా
ఆశల నెక్కుచుందురు దినాంతము నందు సుమాళితో, ఫల
స్తోమముతో, నదేపనిగ, చూపులు మీదనె నిల్పి, భక్తిపూ
ర్ణామర గానముల్ సలుపు నట్టి జనుల్ నిను చూడగా ప్రభూ!

ఏనొక హీన జాతిని జనించిన పాపినటంచు వారు నన్
లోనికి బోవనీ - రసలు లోచన మాత్రెన ద్రిప్పకూడ దం
చానలు వెట్టినారు! పథమందొక మూల నణంగి నిత్య మా
కోనను నిల్చియుందు చను గుంపుల జూచుచు నొంటిగా ప్రభూ!

హేయపు జాతిబుట్టి నిను నెన్నడు గాంచని దాననౌట నే
నో యతిలోక సుందరత లొల్కెడు రూపున నెంతు నిన్ను న
న్నే! యలరుల్ మధూళు లమృతేందు శరద్ద్యుతులర్క కాంతులున్
తీయని పాటలుం జలువ తెమ్మెరలున్ గుమి గూర్చుచున్ ప్రభూ!

నామది కావిధమ్మున గనంబడు తావక దివ్యమూర్తి ప్రే
మామృత వీక్షణమ్ముల ననంతముగా జిలికించి చూచినన్,
కోమల కంఠమెత్తి పలుకున్ మెలమెల్లగ నవ్వు డప్పుడే
దో! మనసెల్ల తన్మయత నొందు ప్రశాంతిసమాధిలో ప్రభూ!

ఈ దిన మెవ్వరో తెలిపి రెల్లకులమ్ములవారు లోనికిన్
బోదగు నన్ని యడ్డులును బోయెనటంచని వింటి: తత్క్షణ
మ్మాత్ర ధరణేంద్ర మెక్కి కనకాలయ గర్భము జేరబోతి, నా
లో దరిలేని కౌతుకము త్రోపులు లాడగ నిన్గనన్ ప్రభూ!

# ప్రతిసీర

ఆలయ గర్భమున్ దరియు నంతట నామది సంతసాక శో
భా లలితమ్ము మర్త్యము శుభంకరమున్ మధుశాంతిదమ్ము నై
వ్రేలెడు నీదురూపము చలింప దొడంగెను: చూపు దేహళిన్
వ్రాలిన యంత వీడెను భవత్కరుణాకృతి నా హృదిన్ ప్రభూ!

లోనికి బోయినా నెదుట లోచన గోచరమయ్యె: చంద్రికా
శ్రీ నవ రేఖలన్ వెలుగు చిన్మయ రూపము గా; జలోక శో
భా నివృతాననాంబుజ భవన్మృదు హాసమధూళి కాదు; మొ
ద్దై నిలువంగ బడ్డ నలుపైన శిలాకృతి ఒక్కటే ప్రభూ!

కనులను మూసి కొంటిని వికారపు బొమ్మను చూడలేక, మై
వణకె జుగుప్సనందు నిలువన్ మనసొప్పక పర్వులెత్తి తత్
క్షణమె ధరాధరమ్ము దిగి శాంతపు లోయను జేరినాను; చే
తన సహితత్వదాస్యముడదన్ గదలాడెను నిప్పుడో ప్రభూ!

ఏనిక దేవళమ్మునకు నెన్నడు బోవను; కోనదారిలో
నైనను నిల్వబోను, భవదాకృతి సంతత శాంతి కాంతినై
న్యానుపమస్మితామృత రసాంబుధి శీకరపాళి జల్లి, మ
నస్సదన వీధి నిల్చిన వసంతముదమ్మగు నాకు నో ప్రభూ!

చల్లని వెన్నెలన్ నగవు జాలు లుషః పవనమ్ములందు నీ
పల్లవ కోమలాంగుళుల స్పర్శ, వసంత పికాల పాట నీ
పల్లకనమ్ములున్ నిరతశాంతిదమై స్ఫురియింపనిమ్ము! నా
యుల్లమునన్ వసించును మహోజ్జ్వల తావక రూపమో ప్రభూ!

శ్రీ పద తావకీన లవలీ మృదులప్రియ మూర్తి శైల గే
హా ప్రతిబద్ధమై నిలువదంచు గ్రహించితి: జారిపోయె మా
యా ప్రతిసీర మామక హృదంతర రంగమునందు! సృష్టి శో
భా ప్రతిపాదకమ్మగు భవన్నిజ రూప మెఱింగితిన్ ప్రభూ!

# మునిమాణిక్యం

శ్రీ ఉన్నవ గోపాలకృష్ణ గోఖలే

తెలుగు లోకానికి సుపరిచితుడయిన ముని మాణిక్యాన్ని, పునః పరిచయం చేయడం ఏటికి నీళ్లు తోడడమని మీరంటే అనవచ్చు. కాని మీకాయన విషయ మంతగా తెలియదనే నా నమ్మకం. తన్నెరుగని ఆంధ్రకుటుంబ ముంటుందా అని ముని మాణిక్యం అహం భావము. ఇంతో అంతో వ్రాయగల వాళ్లందరిలో ఉండే యీ అహంకార మొక పెద్దలోపమని అనుకోవలసిన అవసరం లేదు. కాని ఏదో కొంతం తెచ్చిపెట్టిన కొద్ది తప్ప ఈయన నాటికి ప్రతిష్ఠ యెక్కడిది? పత్రికలలో నాలుగు కథలు పడుతున్నంత మాత్రాన లోకోత్తరమయిన సారస్వత సేవ చేస్తున్నానని ఆయన యెంత గొప్పగా పడుతున్నా లోకం ఒప్పుకొంటుందా యింత అహా మునికి కూడా అప్పుడప్పుడనిపిస్తుంది? ఏదో దానిలో కూడా నాకనే స్త్రీలూ పురుషులూ ఆయన కథలు చదువుతున్నారు అనే అనుకొందాము మాటకు. అంత మాత్రాన ఆయనకు సారస్వత సౌధంలో శాశ్వత స్థానం లభించి పోయిందా? మాటలండీ వాఙ్మయ లోకంలో పేరు సంపాదించడం? పెద్ద పెద్ద పద్య కావ్యాలు వ్రాయాలి. పెద్ద పెద్ద వాళ్ల కంకితా లివ్వాలి. పెద్ద పెద్ద పండితుల యోగ్యతా పత్రాలు పొందాలి. పెద్ద పెద్ద విమర్శకులు వాటిపైం దీర్ఘ ప్రకట్టా భాష్యాలనయినా ఉద్ఘోషిస్తూ పత్రికల్లో వ్యాసాలు వ్రాయాలి. చిట్టచివరకు విశ్వకళా పరిషత్తు వారి అనుగ్రహాన్ని సంపాదించుకోవాలి. ప్రతికొత్త సమీక్షకుల ఆగ్రహానికి గురికాకుండా వారితో పరిచయాలు చేసుకొంటూ ఉండాలి. ఇంత గొడవ ఉంది సారస్వతంలో పేరు గడించు కోవాలంటే! ఈ విషయాల్లో శ్రీ మునిమాణిక్యం చేసిన కృషి యేమీలేదంటాను. తెలుగు సాహిత్య భాష కాని తాత్త్వికాలలో ఏకొక్క విశ్వ విద్యాలయం వారో ఉత్కృష్ట విశ్వ విద్యాలయం వారో ఈయన కథల్ని కూడా పఠనీయ గ్రంథాలుగా నిర్ణయించారంటే అది మన లోక అదృష్టమా?

అయినా ఈ కథలు కూడా ఏవో చిత్రమైన పేరు పెట్టి, ప్రచురించడం ముని మాణిక్యానికే అలవాటయిపోయింది. అదేమి మోహమో గాని యీన పెట్టిన పేర్లు చూసి ప్రజలూ చాలా తొందరపడి దానే అమృతం అనుకొంటున్నారు. ఏ కాలంలో ఆగని విలువగల వస్తువు ఏముందని యీ గ్రంథాలలో విశిష్టమైన నీతి నిచ్చిన కథలు ప్రబోధిస్తాయా? అంతంత వెచ్చించి కొనుక్కున్న పిల్లల కొనుక్కొనే ఉన్న నీతివాక్యాలన్ని నిజానికి వీటిల్లో ఉన్నాయా? పరిణతి భాగవతుల సమాచార ప్రసంగాల లోని మహా ప్రశస్తి వీటిల్లో విహారించినయినా ఉందా? పోనీ, సాంఘిక వ్యవహారాల కుపకరించే నాణెం కొంచెమైనా వీటిలో దొరుకుతుందా? ఎంతసేపూ, నేనూ మా కాంతం మాయిల్లు, మా కాపురం, మా అమ్మ — ఇదే గొడవ గద. మీ గొడవ, మా కాంతం గొడవ, మా పిల్లల గొడవ, మా కాంపుకండీ" అని అనడేమో. అంటూనా ఈ మార్క్ ప్రపంచం? ఈయన వ్రాసేదంతా ప్రతి

యింటా జరుగుతూఉన్న నాటకమేకదండీ! తన యింటి స్త్రీలనుగురించి చాటిచెప్పగలిగే సాహసానికో మన మాయన్ని పొగడడం? మునిమాణిక్యం హృదయం ఏకో సంస్కారం పొందినదే అనుకోండి నిత్యజీవితంలోని సౌందర్యాన్ని గ్రహించేసుకోగల శక్తి ఆయనకు ఉన్నదే అనుకోండి. సృష్టికర్త వలెనే సృష్టిలో లీనమై సృష్టిలో పొంగిపోయే ప్రతిభ కూడా ఆయనకు ఉన్నది అనండి. అంతమాత్రాన దాపరికమన్నది లేక పరువు ప్రతిష్ఠంతో బ్రతుకుతున్న ఉత్తమ గృహిణి అంతర్జీవనాన్ని బహిర్జీవనాన్ని విమర్శించి చూపడం సభ్యతా గౌరవాలకు విరుద్ధం కాదటండీ? అయన్ని సమర్థించడానికి కాంతం కేవల భావచిత్రం మాత్రమే అని వాదింటారు. అలాగే అయితే ఆమెకంటె ఉత్కృష్ట నాయిక ఆయన ఊహకు అందక పోయిందా? అనుకరించడానికి పురాణ కవులు చెక్కి పెట్టిన పసిడి బొమ్మలెన్ని లేవండీ? అచ్చమైన తెనుగింటి ఆడుపడుచే దొరికిందే ఆయన అభిరుచికి?

ఏక నాయకుడి వంక దృష్టి సారించండి సృష్టికర్త సృష్టిలోవను అదృశ్యుడై యున్నట్లు మునిమాణిక్యం కాంతం వెలుగు బాటున తన వ్యక్తిత్వాన్ని మరుగున పరుచుకోన్నడే! ఇది, సత్రుతి అంటారా? కాంతం 'అమర గాథను సంస్మరిస్తూ ఆమె జీవిత ఘట్టాలలో తానొక ముఖ్య పాత్ర అయికూడా ఆడపోసిత మూర్తికే ప్రాధాన్యమిచ్చి తన్నుఋణ్రాయం చేసికోవడం ఏమి బాగుందండీ? తనకాంతం ప్రతిభ ముందు తన ప్రతిభ నీరసమునుకోవడం తనకు విలాసమయితే కావచ్చు. ఇంటిలో తెనుగు ప్రోడల తోడి భర్తల అనుభవాలు ఎలా ఉన్నా, ఇంటి బయట మాత్రం మగ సిరిగల ఏ పెద్దమనిషి ఇట్టి చిన్నతనాన్ని అంగీకరిస్తాడు? అంతే కాక నాయకుడు నాయికనూ నాయిక నాయకుణ్ణీ, నాయికా నాయకులుగా భావిస్తేనరా? మనకు వాళ్లు నాయికా నాయకులుగా ఒప్పింపవద్దా మరి?

ఈ కాలం నలుగురి నోళ్లలో పడాలంటే సినిమా నటుడయినా కావాలి, రాజకీయ ప్రచారకుడయినా కావాలి. ఎంత అమాయకుడు కాకపోతే మునిమాణిక్యం, ఒకవంక అల్లరి పిల్లకాయల అలజడీ మరియొకవంక అధ్యాపక నిత్యకృత్యాల ఒత్తిడీ మధ్య నలుగుతూ కూడా సమయం చిక్కినప్పుడల్లా చల్లని కలలు కంటూ గార్హస్థ్యంలోని సొబగూ సౌరభ్యం నలుగురికీ చవిచూపడమే ఒక పెద్ద దివ్యసందేశంగా చేసికొని కథలు వ్రాసి తరించుదామను కొంటారు?

ఇక ఆయన తత్త్వం. జనవాక్యం వల్ల మునిమాణిక్యం తత్త్వం గోచరం కాదు. కొందరు ఆయనను ప్రేమించే వారెందరున్నారో, గర్హించేవారందరూ ఉన్నారు: ప్రేమించే వారయినా ఆయన్ని ఎల్లప్పుడూ ప్రేమించరు. సమయా సమయాల గ్రహస్థితిని బట్టి ఆయన మీద అనుగ్రహ నిగ్రహాలు మారుతూ ఉంటుంది. సన్నిహితులకు, ఆయన్ని మచ్చిక చేసి కొనే మాత్రం పొగడ్త. సాంఘిక సౌభ్రాతృత్వానికి పొగడ్త ఒక దివ్య సాధనమని ఆయన నమ్మకం కూడాను. తాను పొగడ్త కోసినట్లే సన్నిహితులను కూడా అవచ్చినప్పుడంగా తాను పొగుడుతూ ఉంటాడు. 'ఏమండీ' మీరు నలుగురూ కలిస్తే ఒకరి కొకరు పొగుడుకుంటూ కాలక్షేపం చేస్తారు. మీలో ఇది ఒక సంప్రదాయమా? "అని ఈమధ్య ఒక ఆయన అన్నా

మాట. "అవునండీ! సంప్రదాయమే అనడానికి నేను సిద్ధపడను. నలుగురూ కలిసినప్పుడు ఒకరి నొకరు మెప్పించుకోవడం బయట వారిని విమర్శించడమూ కంటె ఒకరి నొకరు పొగుడు కుంటూ కాలక్షేపం చేయడం అది నీతి అంటారా" అన్నాడట మునిమాణిక్యం.

మునిమాణిక్యాన్ని గురించి చెప్పాలంటే బ్రహ్మ వస్తు నిర్ణయార్థం తార్కికులు ఉపయోగించే "నేతి నేతి" అనే పదాలు చాలవఱకు ఉపయోగించ వలసి వస్తుంది. మీరాయనను గూర్చి ఏ ప్రశ్నవేసినా వేయండి "కాదు" అనే నా సమాధానం. ఆయన వ్యాఖ్యాతయేనా? కాదు. సంప్రదాయియా? కాదు. శాస్త్రవాదా? కాదు. పండితుడా? కాదు. హాస్యకుడా? కాదు. విలాసార్థియా? కాదు. సన్యాసియా? కాదు. మంచివాడా? కాదు. దుర్మార్గుడా? కాదు. ధనికుడా? కాదు. నిరు పేదయా? కాదు. శాంతమూర్తియా? కాదు. కాదు. ముక్కోపియా? కాదు. మానవ సహజమైన గుణాలన్నిటినీ కలిపి సగటు తీస్తే ఆయన అవుతాడని నా యుద్దేశ్యము.

మునిమాణిక్యానికి లౌకిక జ్ఞానము అంతగా తక్కువ. ఇల్లేలోకమనికాని, ఇంటి అవసరాలనే తన అనుభవానికి సరిహద్దు చేసుకొన్న వ్యక్తికి అనుభవ జ్ఞానములో పిస్సుందంటారా? లేదా? ఆయన ఒక్కొక్కప్పుడు డమాయీ కత్తుల్ని నటిస్తాడు. ఒక్కొక్కరి వేషాలు వేస్తాడు. తెలిసీ తెలియని వాడుగా కనిపిస్తాడు. పిచ్చి ప్రశ్నలు వేలకు వేలు వేస్తాడు. అవసరమైనప్పుడు డబ్బాయి కరమైన అబద్ధాలుకూడా అల్పాల్పంగా ఆడతాడు. ఇదంతా లోకాన్ని మన్నింపజేయించి తానుకూడా చెప్పిని తేటలు గలవాడని తెలియ చేసుకోడానికి ఎత్తుగడ, ఈ వక్రబుద్ధులకు ప్రపంచం లోకసహజమైనదని తెలిసి కోగల జ్ఞానంకూడా ఈయనలో ప్రాబల్యం. లౌకిక తెలుగని వాక్కు; నాటాడు తెలియని నడవడి—మునిమాణిక్యం శీలంలోని విశేషాలు,

మునిమాణిక్యానికి జీవితంలో సమస్యలనేవి లేవు. జీవిత పర్యావధి జీవించడమే అని కాబోలు ఆయన తలపు. పెద్ద పెద్ద సమస్యలపై ఆయన కక్షపొందరు లేరు. రాజకీయ విషయాలన్నా మత విషయాలన్నా నైతిక సూత్రాలన్నా ఏ రకమ కళాసిద్ధాంతాలన్నా ఆయనకు తలనొప్పి. జీవితం సిద్ధాంతాల నన్నిటినీ అతిక్రమించి సాగిపోతుందని ఆయన ఏకైక సిద్ధాంతం. ఆయన జీవితంలోని ప్రతిఘట్టం ఈ సిద్ధాంతం మీద ఆధారపడ్డదే! నీతికి నడవడికీ హృదయమొక్కటే మార్గదర్శి అని ఆయన నమ్మకం, కళా సంస్కృతి కిచ్చే హృదయాన్ని వదిల పలుచుకొని గాక ని నమ్మి ఏ కార్యమైనా చేయవచ్చునంటాడు మునిమాణిక్యం. నేనొకప్పుడాయనను మందలిస్తూ 'లోకం మనకైనా బుద్ధిలేదండీ' అన్నాను. 'వాస్తవమే కాని హృదయముందండీ' అన్నాడు చటుక్కున. ఈ వింత వ్యక్తి భావాలతో బుద్ధిమంతు లెవరేకీ భవిస్తారు?

మునిమాణిక్యంలో సమంజసమైన నడవడి చాలా కనిపిస్తుంది. ఆయన బుద్ధుడు కన్నతాను, కాని జాతీయ తత్త్వాలతో ప్రసక్తి లేకపోతే, తెలుగు జాతిని తెలుగు మయం చేయాలంటాడు, కాని ఎప్పుడూ ఇంగ్లీషు పుస్తకాలు ఇంగ్లీషు పత్రికలూ చదువు తూనే ఉంటాడు. తెలిసిన వస్తువు లైన ఇంగ్లీషుపదాలే వాడి మాట్లాడతాడు. మాస్టా

విశ్వాసాలను గాఢంగా నిరసిస్తాడు. ఆయన కున్న మూఢవిశ్వాసాలు చదువు సంధ్యాలేని నాల కుండికి ఉండవు. పదో, పాతికో నిల్వ చేసికొనే ఉద్దేశంతో వేడిగా ప్రసంగాల్లో ఒప్పుకొంటాడు. పదో పాతికో అప్పు చేసి మదరాసు నుండి తిరిగి వస్తాడు. భయభ్రాంతులు లేనట్టు నటిస్తాడు తన నీడనే చూచుకొని బెదరి పోతుంటాడు. కవిత్వం అంటే అభిమానం చూపిస్తాడు. 'అది' అర్థం మాత్రం చేసుకోలేడు. ఎవరైనా అది బాగుం దంటే ఆయనకు బాగే; ఓగంటే ఆయనకూ ఓగే.



తూనిటీవారి "సాయిబాబా" లో ఒక దృశ్యం.

# చిత్రజగత్

## రత్నమాల

నిర్మాతలు : భరణీ పిక్చర్సు

నటీనటులు : భానుమతి నాగేశ్వర్రావు, సి. యస్. ఆర్, గోవింద రాజు" మొద॥

కెమేరా : సెల్వరాజ్

సౌండ్ : దిన్నా కుమారానీ

స్టుడియో : న్యూటోన్

డైరక్షన్ :

రామకృష్ణ.

ప్రివ్యూ : న్యూగ్లోబ్ : 28-12-47.

రత్నమాల అతి గారాబంగా పెరిగిన రాకుమారి, ఎవర్నీ పెళ్ళాడ నంది. మరొక దేశపు మంత్రి రాజ కుటుంబం మీదభక్తితో మాయ మాటలు చెప్పి రత్నమాలను, తన రాజుకు కోడల్నిగా చేయగల్గాడు. తీరా,

"విశాఖ"

శయ్యాగృహంలో ఆ విలాసవతి ప్రవేశించే సరికి పటంలో చూసిన, నవయౌవనవంతుడు కాదు భర్త, ఉయ్యాలలోని పసిపాప. పదహారేళ్ళ పడుచుకు, పదహారు రోజుల పాపడా భర్త? రత్నమాల ఆ పసికూనతో అరణ్యాల్లోకి వెళ్ళిపోతుంది. తుదకు, పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహం వల్ల, తనవాళ్ళందర్నీ కలుసుకోవటమే కాక, సమవయస్కుడైన భర్త పాపు చేరగల్గుతుంది. ఇదీ కథ. అసలు యీ ఇతిహాసం, చైనా వాఙ్మయంలో ప్రచారం పొంది, "చంద్రకాంత" నాటకంగా అవతరించి, కొన్ని పుష్కరాల పూర్వం ఆంధ్రదేశంలో ఆడబడేది...

ఇందులో భానుమతి రత్నమాలగా, శృంగారం, విహారం, విచారం, అన్నీ నటించింది. అన్నింటికీ వీలుగా ఉండే పాత్ర అది. కథా వస్తువులో ఆమె నాయకి. నాయకుడు

కూడాను. చిత్రం ప్రారంభం నుంచి, చివర వరకూ భానుమతే.

మంచి కథ. Taking బాగుంది. డైరక్షన్ బాగుంది. కెమేరా పని చక్కగా ఉంది. సౌండ్ కొద్దిలోపాలతో ఫర్వా లేదనిపించింది. ఎంతో చక్కని పాటలున్నాయి. మొత్తం మీద సంగీతం బాగుంది. నటీ నటులంతా తమశక్త్యానుసారంగా, దర్శకునికి తోడ్పడ్డారు. కాని, చిత్రించూస్తూవుంటె, ఏకారణంవల్లనో ప్రేక్షకుడు, ప్రతి సన్నివేశంలోనూ, ఆయా రసానుభూతిని పొంది, ఆనందం చెందలేక పోయాడో నాకు తెలియడం లేదు. ఏమీ లోటు లేనట్లు కన్పిస్తుంది. కాని ఏమీ చలనం అగుపడదు. ఒక చక్కని Still Photo చూస్తు వున్నట్లు, ఒక మంచి సీనరీ పెయింటింగ్ చూస్తూ వున్నట్లు అనుభూతిని పొందుతాము. అంతే కాని, ప్రతి ఘట్టంలో, ఆయా సన్నివేశాలతో మిళితమై, పోయినను భరించ లేక పోయాను. చిత్రంలో Tempo లేదని గాని, Narration సరిగ్గా లేదని గాని, Situation సందర్భశుద్ధిగా లేదనిగాని, నేననను. కాని, మొత్తంమీద చిత్రంలో ఏదో వక సౌఖ్యం లోకి చూస్తూ వున్నట్లు భావన. అంత మాత్రంచేత మంచి దృశ్యాలు లేకపోలేదు. అదీగాక, చిత్రం ప్రారంభం నుంచి, చివర వరకూ, "ఒకే పాత్ర" పాటలతో, శృంగారంతో, ఆటలతో, ఏడుపుతో, కష్టాలతో, కలలతో, ప్రేక్షకుల్ని కూడా త్రిప్పుతుంటుంది. ఏమైనా కథలో కొన్ని Situations ఉన్నాయి. స్త్రీ జనాన్నాకర్షించే కొన్ని సన్నివేశాలు కల్పించ బడ్డాయి. భానుమతి చక్కగా పాడింది. నటించింది. అదే కథలో ఒక తృప్తి.

కేవలం హాస్యం కోసం సృష్టింపబడ్డ పాత్ర సి. యస్. ఆర్. ది. వృద్ధుల్లో, అందుల్లో, మనుష్యుల్లో, దేవతల్లో, అతలోక విమోహకుడు. కొన్ని చోట్ల నిజంగా నవ్వు వస్తుంది. గోవిందరాజులను గురించి ఏమీ వ్రాయకుంటా ఉంటే చిత్రానికి మంచిది.

భరణీ వారి ప్రథమయత్నం, Box Office అవుతుందని నమ్మకం. జయప్రదమైన చిత్రం "రత్నమాల" రామకృష్ణ డైరక్షన్లో ఎంతో ఆశ కల్పిస్తోంది

* * *

శ్రీ ఛత్రపతివారి "రాధిక" అతిత్వరలో విడుదల అవుతుంది. బాలసరస్వతి, రఘురామయ్య మొదలగు వారు నటించిన యీ చిత్రాన్ని, శ్రీ వి. పి. టి. సదాశివ్ డైరక్టు చేశారు. చిత్రాన్ని చూసిన వారు, బాగా డబ్బునస్తుందని. చక్కని జానపద గీతాలు, వున్నాయని చెప్పున్నారు.



యూనిటీ వారి "సాయిబాబా" లో
శ్రీ మన్నవ రామచంద్ర రావు

శ్రీ యూనిటీ పిక్చర్సు వారి "సాయిబాబా" చిత్రం చంద్రా ఆర్టు స్టూడియోలో సగం పైగా తయారయింది శ్రీ అద్దంకి, పారుపల్లి, సి. యస్, ఆర్. మున్నగు వారు నటిస్తున్నారు. శ్రీ పట్టాభి డైరెక్షన్.

*　　*　　*

# వింధ్య రాణి

సమీక్ష

స్టేజిమీద బాగా రక్తి కట్టిన డి. వి. సుబ్బారావు నాటకం, తెరమీద, శ్రీ సి. పుల్లయ్య దర్శకత్వం క్రింద తయారు చేయబడింది. చిత్రం డబ్బుచేస్తుంది మొత్తం మీద ఆర్ట్ లోట్లులేవు. సంగీతం బాగుంది. ఫోటోగ్రఫీ ఆకర్షణీయంగా వుంది ముఖ్యంగా పుష్పవల్లి, రమణారావులు అనుకున్న దానికంటె బాగానే నటించారు. బ్రహ్మాండమైన సెట్టింగులు "జమినీ" వాతావరణ గౌరవాన్ని నిలబెట్టాయి. వరలక్ష్మి, రేలంగిల దాంపత్యహాస్యం కొన్నిచోట్ల అతిగావున్నా ప్రేక్షకులకు విసుగు కల్గించదు పూర్తి రివ్యూ పై మాసం "ఆంధ్రశిల్పి" లో వస్తుంది.

# ఆంధ్ర శిల్పి

తయారులో వున్న యితర తెలుగు చిత్రాలు.

1. శోభనాచలవారి "మదాలస"
2. "కీలుగుఱ్ఱం"
3. స్వతంత్రా వారి "ద్రోహి"
4. ప్రతిభావారి "బాల రాజు"
5. స్వస్తిక్ వారి "ధర్మాంగద"
6. మాచిరాజువారి "భట్టివిక్రమార్క"
7. సువర్ణవారి "స్వర్ణమాల"
8. ఉషావారి "కలికాలం"
9. శ్యామలావారి "గీతాంజలి"
10. పద్మనాభావారి "చంద్రవంక"

ఏవంకా లేకుండా ఇవన్నీ త్వరలో వస్తాయని ఆశిస్తున్నాం!



# ★ మనిషి ఖరీదు ★

శ్రీ
అనిసెట్టి
సుబ్బారావు

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ఇవాళ వెలిసింది. సూర్యుడు లోకానికి అప్పు పడ్డవాడి లాగ దొంగతనంగా తొంగిచూస్తున్నాడు. ప్రళయం వచ్చి భూమి కరిగి పారినట్టు వరదగోదావరి పొంగుతోంది. పట్టణంలోకి వెళ్ళి మానవుల విచిత్ర జీవితం చూడాలనేమో, గట్లు నొరుసుకుని పైపైకి ఉబుకుతోంది. క్రమక్రమంగా గట్లు మీది కొరుగుతున్న మోటారుబోట్లు, పడవసరంగుల కేకలతో కోలాహలంతో నిండి ఉయ్యాల లూగుతున్నాయి. సరంగులు పడవల్లో కెక్కేనీళ్లు తోడిపోస్తున్నారు, తడి గుడ్డలు పిండుతున్నారు, పొయిలోనుండిలేచిన పొగ చెమ్మగా నిమ్మళంగా ఎండలో తీగలు సాగుతున్నది. సరంగులు, చాకళ్లు గోచీలు పెట్టుకుని, కండలు తిరిగిన వీపులు, ఎండలో మెరిపిస్తూ ప్రవాహంలో కొట్టుకు వస్తున్న కొయ్యముక్కలు, కొమ్మలు, దుంగల వంక ఆశగా చూస్తున్నారు.

ఒక ఒరిగిన పడవ మీద భద్రంగా నిలబడి నాగన్న కొడుకు సత్తిగాడు, అల్లుడు, రంగం హుషారుగా మాట్లాడుతున్నారు.

"ఒకటి, రెండు, మూడు... ఎన్ని దుంగలా బాబు! అడవులోళ్లు దివాలా తీసి చస్తారు"

"నా సొమ్మేం మునిగిందోసె... పోతే కంట్రాక్టరే పోయె... నేనీయ్యేళ దిగనోసె... నావొళ్లంతా యిరగొట్టినట్టుంది"

"ఒరే, ఎవరికి మస్కా యేత్తావురా... పడుచుది కంటో పడితే నువ్వు గోదావరిలో కాదు, సర్గానిక్కూడ పోవురా... నీయేషాలు నాదగ్గరా?..."

వాస్తవం కని పెట్టినందుకు సత్తిగాడికి కోపం వచ్చింది.

"నీ అబ్బ సొమ్మేం ఇదంతా ... మును పెప్పుడన్నా ఈ మాదిరిగా లేచిందా గోదారి? చస్తామో, బతుకుతామో. నేరాను ... అదుగో యముడొచ్చాడు చూడు"!

ఇద్దరూ ఒక్కసారి ఒడ్డు మీదికి చూశారు. సాహుకారు గుమాస్తా, నాగన్నతో బేరమాడుతున్నాడు. వేలెత్తి గోదావరిలో దూకుతూ పోతున్న దుంగల వంక చూపుతున్నాడు. బ్రిడ్జీ స్తంభాలకు తగిలి, పక్కకు మళ్లీ ఒక దుంగ ఊగుతూ, వెళ్లిపోతున్నది. దుంగమీద నల్లని, మట్టిని, తెల్లని నురుగు ముక్కతో పొదుస్తూ కాకి ఒకటి ప్రయాణం చేస్తున్నది. ప్రవాహం చుట్టలు చుట్టుకుంటోంది, మడతలు పడుతోంది. సున్నగా సాగుతోంది.

నాగన్న గుమాస్తా ఇద్దరూ గోదావరి కేసి చూస్తూనే మాట్లాడుతున్నారు. ప్రక్కనే నిలబడ్డ

షాహుకారు మాత్రం గ్లాస్గో ధోవతి మీది మట్టిచినుకు గోటితో గీరుతున్నాడు.

పడవలో పొయి రాజేస్తూ తడి పుల్లల్ని తిట్టుకుంటున్న సత్తితమ్ముడు, బీడీ దమ్ము పీల్చి, నిప్పురవ్వను పడవమీద ఒత్తి ఆర్పి బీడీముక్క బొడ్డులో దాచుకున్నాడు, సత్తి, రంగం వొడ్డుమీదికి ఆంగ వేసి వచ్చారు. పడవ ఒక్క అదటున ఊగి అలలు నాల్కలు సాగి ఒడ్డున రాతి కట్టడంలో మట్టిని నాకుతున్నాయి.

గుమాస్తా—"ఒక్కమాట మీద నిలబడవోయ్...

మళ్లీ మేం పిలిపించటం, బేరం కుదర దనటం దేనికి? గుర్తుంచుకో ఇప్పుడు, నీతో అవసర మొస్తే రేపు మేం కావాలిసొస్తాం."

నాగన్న "చెప్పండి మరి ... కుదిరితే సరేనంటాం. లేకపోతే ఒకదణ్ణమెట్టి తొంగుంటాం" ...

గుమాస్తా" మూడు గాకపోతే నాలుగు లాగుతావ్ నీకేంరా! మూడురూపాయ లేసుకో. తరుగు మిగులు లేదు"

సత్తి" దానమ్మది మాటేందయ్యా ... పడవలో నీళ్లు తోడిపొయ్యటమే గగనమైంది. ఐతే రాయ్యాతి అవుద్ది ... దుంగలు నీకాళ్ల కాడొచ్చి పడ్తై"

షాహుకారు తీవ్రంగా చూసి, సిగరెట్టు వెలిగించటానికి జేబులో అగ్గిపెట్టె కోసం వెతుకుతున్నాడు. "నాగన్నా.నువ్వు చెప్పరా! సత్తి నువ్వు ట్లావుండు" అన్నాడు. అగ్గిపెట్టె తీసి పుల్లగీచాడు. మూడురూపాయలు ఆపైన లాభంలేదు ...ఆలోచించుకో"అతనే అన్నాడు,

నాగన్న అగ్గిపెట్టె కోసం చెయి సాచాడు. "పుల్లొకటిప్పించండి బాబయ్యా!"

షాహుకారు నాగన్న నల్లని వేళ్లవంక పరిశీలనగా చూసి, జేబులో పెట్టేసుకున్నాడు, నాగన్న చుట్ట తుడుచుకుంటూ" సరేకానియ్యండి. అదృష్టంముండాలె గాని" అని. పడవ వేపుకి తిరిగాడు. సత్తి, రంగం నిశ్శబ్దంగా వెంబడించారు.

పొంగే గోదావరి మీది కసిగా వాటర్ వర్క్సు ఊ నీరు పీల్చుకుంటూ రొద పెడుతోంది. ఆవతలిగట్టున విశాలమైన పచ్చిక బయళ్లమీది నుంచి చీకటి ముసురుకుంటోవస్తోంది. అంతకంతకు గోదావరి నల్లబారి తారు ప్రవహించినట్లౌతోంది పట్టణమంతా విద్యుద్దీపాలు గప్పున వెలిగాయి. పడవల్లో పొగ, కేకలు. దీపాలు. వాన సూదిజల్లుగా ప్రారంభించింది. ధర్మదాతలు బిచ్చంవేసి నట్లు సందేహిస్తూ, కురుస్తూ వెలుస్తూ వుంది, విద్యుద్దీపాలు వెలుతురు తాళ్లతో గోదావరికి వల వస్తున్నాయి. గర్భవతి నిండు తనంతో గోదావరి పొంగుతోంది. రైలు ఒకటి రొద పెడుతూ బ్రిడ్జి ఎక్కింది. అస్పష్టంగా పడవల ఆకారాలు గోచరిస్తున్నాయి. బెదురుగా, నత్తగుల్లలాగు ఈడ్చుకుంటూ పాకుతోంది రైలు.

పడవలో కుర్రాణ్ణి బొక్కెనతో నీళ్లు తోడి పొయ్యమని నియమించి. ఒడ్డున మేకులకు తగిలిం

చిన మోకులు బిగలాగుతున్నాడు నాగన్న.

"ఓరి సత్తీ, అయిందేటిరి?"

"వచ్చానయ్యా. రంగడూ అద్దంముక్క ఎక్కడుంది."

రంగడు పకాలున నవ్వాడు "గోదావరి లోకి పోతుండ్నారా ... పిల్లదానికి అద్దం. రెవిక గుడ్డ అద్దకం చీరలు ..."

వెంటనే వీపున ఫెళ్లున వేశాడు సత్తి. రంగడు వేళాకోళమాడుతూనే వుంటాడు. సత్తి పిల్లకోసం ఎదురు చూస్తూనే వుంటాడు. రంగ డంటాడాని "సంద్రం పోటులో వుంది ... నీగుండెలోనూ వుంది నీళ్లలోనూ వుంది ... చిన్నదాన్నోమాలి పిలిపించ నేటి ?" అంటూనే మజ్జిగన్నం జుర్రితున్నాడు.

సత్తికి నవ్వూ, కోపమూ, పెనగొని వచ్చి, జుట్టులో వేళ్లుజొనిపి, గీరుకుంటూ తైటికి నడిచాడు. ఎక్కణ్ణుంచో ప్రతిధ్వనించినట్లు సత్తి వలచిన పడుచు పిల్ల కంఠం మోగుతోంది. స్నేహం కుదిరి నెల నిండ లేదు. తండ్రి చూచి, ఇంకా, ఏమన లేదు. సత్తి కంటికి నిద్ర లేదు.

ఎంగిలి గిన్నె కడుక్కుంటున్న రంగడికి ఒడ్డున కిలకిల నవ్వులు, విన్పించాయి" వీడు తిండప్పుడు తింటాడు గోదారి కెళ్లే దెప్పుడు!" అనుకుంటుండగానే నాగన్న కేక విన్పించింది

"తెప్పలు పడే కాను రాండరేయ్ ఓరి రంగం! సత్తీ! తిండిపోతు గాడ్దెలురా!"

టకటక టక మని దూకుతూ వచ్చాడు సత్తి. నాలుగు మెతుకులైనా నోట బట్టలేదు. తెప్ప మీదికి దుమికాడు, లోలోపల నవ్వుకుంటూ రంగంకూడా.

చినుకులు జడివానగా పెరిగి మేకుల్లాగు తగులుతున్నాయి. వెన్నెల ఉండీ లేనట్లే, ఒకసన్నని కాంతిపోగు నది మీదికి జారుతోంది. తెప్పలు కీలుగుర్రాల్లాగు మునుగుతూ తేలుతున్నాయి. గోదావరి నురుగులు కక్కుకొంటూ శిలలు పెనగులాడుతూ పోతున్నట్లు అక్కడక్కడ దూలాలు ఒకటి రెండు అడ్డువచ్చి, ఆరు చేతులు కలిసి అడ్డు పడితే, ఆగినట్లే ఆగి, రెండవ మొనకు తిరిగి దూసుకుపోతున్నాయి.

"ఏఅడవుల్లో కొట్టారోగాని, దానమ్మది బ్రిడ్జీ అంత పొడుగుం దిరా ఒక్కొక్కటి" అన్నాడు నాగన్న.

"బ్రిడ్జీ ఏంటీ... కొత్తగా మిల్టరీ ఇళ్ళు కట్టారే అక్కడ... ఒక్కో దూలం పది కాపురాలకి సరిపోతుంది" అన్నాడు రంగం.

"మునుపు ఇట్లాటిదే. వానాకాలంలో యిరిగి ఒక బిడ్డా రెండు దూడలూ అప్పచెప్పిపోయినై" అన్నాడు సత్తి పరధ్యానంగా.

"ముందుకు పోదాం ... అక్కడ నిమ్మళంగా వుంది ... చేపని పట్టినట్టు లాగెయ్యొచ్చు" అని రెండుచేతులూ నీళ్లలో జొనిపి వెనక్కుతోస్తూ నడుం వంచి ముందుకు సాగుతున్నాడు,

నాగన్న. వెంబడించారు సత్తి రంగం కూడ. మెల్లగా చేతులెత్తి వేళ్లనిండా చుట్టుకుంటున్న నాచు, తీగలు, నురుగు తీసి నదిలో వదులుతున్నారు.

వెన్నెల వ్యాపించి, వానచినుకులు బంగారు తీగల్లాగు మెరుస్తున్నాయి. ఒక మేఘం సింహంలాగు జూలు విరబోసుకుంటోంది. చంద్రుని చుట్టూ వలయాలేర్పడి ఆకాశంలో బొమ్మ కట్టినట్టుంది. మరోక వంక పనిపిల్లలు పలకమీద గీసిన పిచ్చి గీరల్లాగు మెరుపులు దిక్చక్రం వరకూ సాగుతున్నాయి మెరిసిన క్షణం లోనే తలలెత్తి, చూపులు సారించి నదినంతా కలయ వెతుకుతున్నారు దూలాల కోసం. దూలాలు దొరికితే తర్వాత సౌందర్యం ప్రకృతినీ, మానవుణ్ణీ ఋషుల్ని మనిపించేఆరాత్రి సౌందర్యారాధన చేస్తో, పాటలు పాడుకుంటే దూలాలెలాగ వస్తాయి. తిండికి జరిగితే తర్వాత సౌందర్యం. సత్తి, మనస్సులో పిల్లను గురించి తలపులు నెచ్చగా వ్యాపించి ఉదుకెత్తించి స్పృహను తెస్తున్నాయి మళ్లీ.

అక్కడక్కడ, దూలాలు పగబట్టిన పాము ల్లాగ పడగెత్తి, వస్తున్నాయి, విసురుగా వచ్చి తెప్పలను తగలబోయి తప్పించుకుంటున్నాయి, విసుగును వేళాకోళంగా మార్చే ప్రయత్నంలో రంగడు చెవి యొగ్గి వింటూ,

“పదకొండు ... పదకొండేనా ... ఎంతైతే ఏంటి ... వాడు కమ్మగా తొంగోనుంటాడు” అన్నాడు.

ఒడ్డుమీదినుండి గంటల గణగణలు నెమ్మదిగా కలలోలాగ తేలుతూ వచ్చాయి, ముళ్ళలాగు గుచ్చుకునే చలిలో, గోదావరినీళ్లు కాళ్ళు కరుస్తున్నాయి

షావుకారేనా ... నువ్వు తెప్పవేశావని ఒడ్డున పడి గాపులు కాస్తాడు... పాపం సత్తి!” అన్నాడు సత్తినవ్వినట్లు స్వరం వొణికింది.

“ఎప్పుడూ నవ్వేరా! నవ్వు నాలుగందాలచేటు. కబుర్లు గాని, దూలం వొస్తే మాత్రం తింటుందనుకుంటాడో ఏమో తొలిగి తొలిగి పోతాడు ... మరి” అన్నాడు రంగడు.

“రా మరి ... మొనగాడొచ్చాడు! మొగతనముంటే రావోయి ... నాలుగు దూలాలు అంటే పన్నెండు రూపాయలు కళ్లజూడందే తిరిగొస్తానా,

“ కుర్రదానికి కోక వస్తుందిలే ”

హఠాత్తుగా నాగన్న “ఇదుగో, ఇదుగో” అంటూ ముందుకు తోసుకు పోతున్నాడు, రంగం, సత్తి తెప్పలు తోసుకుంటూ ముందుకు పోయి అడ్డు పడ్డారు, దూలాన్ని సత్తి గట్టిగా వాటేసుకున్నాడు. దూలం తెప్పలకు తగిలి టక్ టక్ మని శబ్దం చేసింది. రంగడి వంగిన ముఖానికి తగిలి దిమ్మరపోయి తెప్పరిల్లాడు, పాము జారినట్లు నీటిలో మునిగి అడుగు నుంచి దూలం వెళ్లిపోయింది. చేతితో తాపీగా తనకింద తెప్పని అమర్చుకుంటూ— “పట్టాడోయి! మొగాడు! అబ్బాయ్ దర్పాలెందుకురా ... నాతోనా ”! అన్నాడు రంగడు.

నాగన్న ఒక్క సారి ఒళ్ళు విరుచుకుని కొయ్యచత్రం మీద అదే పిల్లవాడిలాగ ఊగుతూ ఆకాశం వంక కేసి చూస్తున్నాడు.

నల్లని మేఘాలు అంచులు కలిసి గోడ కట్టినట్లైనాయి. వాన తుంపురులు సందేహంగా కురుస్తున్నాయి. వెన్నెల మేఘాలలో వ్యాపించి పలచబారి చినుకులలో కరిగి పోతున్నది. తీరం నుంచి హఠాత్తుగా ఏదో కేక విన్పించింది. దీపాలు వెలుగుతూ ఆరుతూ పడవ కదలికను సూచించాయి. ఒడ్డున పాతిన మేకులు వాన తెమ్మకు పెళ్ళగిల్లాయేమో, పడవ ఒకటి తేలిగా సముద్రం లోకి ప్రయాణం ప్రారంభించింది. సరంగుల అరుపులు గాలిలో తేలి వస్తూ సత్తికి తనపడవనూ, పడుచు పిల్లను, జ్ఞప్తికి తెచ్చాయి.

నాగన్న మాత్రం ఏక దీక్షగా నది మీది విశాల ప్రదేశమంతా కలయ వెతుకు తున్నాడు.

“పోదాం ... దూలాలు దయ్యాలు మనవల్ల కావు ... వెళ్ళి పోదాం” అనబోతున్న సత్తిభుజం మీద చరిచాడు రంగడు. నవ్వాడు

“ఏది...మునుపు అడిచేశాం ... నిన్న ఇది చేశాం. అనిడచ్చీలు కొట్టకపోతే ... ఒక దూలాన్ని పట్టరాదూ మజా తెలుస్తుంది” అన్నాడు మళ్లీ రంగడు,

సత్తికి పట్టుదల వచ్చింది పట్టుదలేకాదు, బ్రతుకు తెరువు కూడా,

“ఈ తడవ ఎవరు ముందుపట్టుకుంటే వాడిదే అన్నాడు సత్తి గట్టిగా.

“ముసలోడు పడేసి తంతాడు ...నాకు చొక్కా చిరిగి నాలు గేళ్ళయింది” అన్నాడు రంగం.

“మరిచేలకు ... నోర్మూసుకో” అనిసత్తినవ్వాడు.

“నువ్వా నేనా ! చూదాంపద’ అన్నాడు రంగం.

“దూలం మీద చెయ్యేసి తర్వాత మొగోణ్ణని చెప్పు” అని సత్తి వెంటనే దూలాల కోసం చీకటిని వేటాడు తున్నాడు.

ఇద్దరి పట్టుదలలూ, నాగన్న మెప్పు పొందే ఆశ హెచ్చాయి.

ఇంతవరకూ దూరంగా తేలుతూ వెదుకుతున్న నాగన్న దగ్గర గా వచ్చి “ఎంతరా” అని అడిగాడు. “ఒకటూ?” అని జవాబుచెప్పుతున్నాడు.

గంట ఒకటైనట్లు ఇద్దరికీ విన్పించ నేలేదు.

నాగన్న మళ్లీ, “దానమ్మది వరదగా పొంగు తుందిరా ... ఎన్నడూ లేదు ... అరవయ్యో, అరవయ్యొకటో ఎక్కువుంటుంది ... జాగర్త సత్తిగా” అన్నాడు.

ఏక్షణం మెరుస్తుందోనని సత్తీ, రంగం నదిమీదికే చూపులు నిగిడ్చారు,

మెరిసింది. రెండు దూలాలు పెనపాముల్లాగ త్రోసుకు వస్తున్నాయి. వాటితోవ ఊహిస్తూ నది మధ్యకు వెడుతున్న సత్తి రంగణ్ణి, నాగన్నని కేక వేసి రమ్మన్నాడు. దుముకుతూ, ఊగుతూ కొండ మీది నుంచి పొర్లిపడే శిలల్లాగ వస్తున్నాయి దూలాలు, అక్కడక్కడ ఉంగరాలు తిరుగు తున్న నురుగు కుప్పలు చెల్లాచెదరై విడిపోతున్నాయి. పుల్లలు, కొమ్మలు సత్తిని, గీరుతూ వెళిపోయాయి. ఒకదూలం వస్తూ వస్తూనే బ్రిడ్జి స్తంభానికి తగిలి అడ్డంతిరిగింది.

రెండవది మూకి వచ్చేస్తోంది" ఇదుగో ఇక్కడే" అంటూ రంగం దానివైపుగా తోసుకు పోయాడు, తెప్ప చివరికి రంగం కాలికి బలంగా గుద్దుకుని దూలం పక్కకు తిరుగుతోంది, వెనుక మొన నదికి అడ్డంగా తిరిగి ముందుకు వస్తున్నది. పట్టుతప్పితే ఆ దూలం జారిపోయినట్లే.

రంగడితో "పట్టు... పట్టో... అంతే" అంటూ సత్తిని రెండవ వేపుకు పంపాడు నాగన్న. ఒక్క ఊపుతో సత్తి దూలానికి అడ్డం పడ్డాడు, రెండు తొడల మధ్య తెప్ప ఒకసారి మునిగి, సత్తిని గొంతు వరకూ మింగింది నది. తెప్పరిల్లుకొని మళ్ళీ తెప్పను అదుపు చేసుకున్నాడు. ముందుకు వంగి ఈతలో లాగ పడుకుని దూలాన్ని రెండు చేతులతో గట్టిగా వాటేసుకున్నాడు. మెడలో హనుమంతుని తాయెత్తు పీలికట్లై తెగి నీటిలోకి జారిపోయింది. దూలం సత్తినే ప్రవాహం లోకి తోసెయ్యడం మొదలెట్టింది.

"వొదులు వొదులు...ఓరె నిన్నే" అని నాగన్న అరుస్తూనే వున్నాడు, రంగం చేతిపట్టు తప్పి దూలం ఒక మొన జారి పోయింది. దూలం నిర్లక్ష్యంగా నెమ్మదిగా ప్రవాహానికి నిట్టాగె సాగింది. వెనుకభాగం సత్తిచేతిలో వుంది. పెంకిపట్టు పట్టి, తిమింగిలాన్ని బంధించబోయే చేపలాగ చేతులు, కాళ్ళు దానికి పెనవేశాడు. తొడలకింది తెప్పజారి ఒకటి రెండుసార్లు పట్టుతప్పి, ఒక్కసారిగా ప్రవాహంలో మునిగింది. వెళ్ళిపోయింది. తెప్పకోసం చీకటి చిల్లులుపడేలాగ చూస్తూనే, సత్తి దూలం పట్టుకుని కాళ్ళు ఊపుతూ ఊపిరి పీల్చుతున్నాడు.

"దూలాలు... వొస్తున్నై... అబ్బో... అడ్డులే... రారా!" అని రంగం బిగ్గరగా కేకలు వేస్తూనే వున్నాడు. ఇంతలో దూలాలు వెనుకనుంచి రానే వచ్చినై. సత్తిదేహాన్ని దూలాలు నీటిలోకి ఒత్తి పట్టినై. ప్రవాహం లోపలికీడ్చి, లాగి, అగాధమైనదో శక్తితో పెనవేసి ఊపిరి సలపకుండా చేసింది.

రంగం వెతుకుతూ వస్తూనే, నాగన్నకు మరొక దూలం చూపించాడు. దాన్ని వేటాడుతూ నాగన్న కుడివేపుగా వెళ్ళిపోయాడు. రంగానికి భయంలేదు. సరంగులు జలచరాలు. ప్రవాహవేగంతో తనూ పోటీ పడి సత్తిని వెతుకుతూ బయలుదేరాడు. నది మీద తేలుతున్న వెన్నెల గిరిలో సత్తిభుజం ఒకసారి కన్పించింది. అక్కడికి దుమికాడు. పెద్దముళ్ళకంప తేలుతూ వచ్చి జుత్తును, ముహాన్ని, వళ్ళాన్ని గుచ్చుకొని, దేహం నిండా జర్రునగీరి వెళ్ళిపోయింది. సత్తి భుజం కన్పించినచోట సుడి గుండం వున్నదేమో, నాలుగాకులు, ఒక నురుగు గుట్ట, మకిల తేలుతూ గిర్రున తిరుగుతున్నాయి.

... ... ... ... ........ ....... ... ... ...

పట్టణంలో విద్యుద్దీపాలు ఆరిపోయాయి, క్రమక్రమంగా ఆకాశం ఎర్రబారి సూర్య బింబం పైకెక్కుతోంది. పట్టణం మేలుకుని ఆవులిస్తూ నిద్ర విడిలించింది. సత్తిరాలేదు, వెతుకుతూ ధవళేశ్వరం వేపు ఈదుకుంటూ వెళ్ళిన రంగడు గూడ రాలేదు. పడవల్లో అలవాటే. సరంగులెవరూ పట్టించుకోలేదు. నాగన్న ఒక దూలమైనా దొరికిందనే తృప్తితో గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు. పిల్లవాడు మాత్రం పాయిలో మండని తడిపుల్లల్ని తొట్టి

కొంటూ, దిక్కులు వెతుకుతున్నాడు. పడవలో నీళ్ళు తోడి పోస్తూ, రాత్రి పీడ కల వచ్చిందేమో, పెద్దపులి వంక చూసినట్లు గోదావరి వైపు చూస్తున్నాడు.

"ఒరే నాగన్నా!" అని చివరి పడవలో సరంగు కేక పెట్టాడు. ఆ కేకలో వున్న గుప్తార్థాన్ని గ్రహించినట్లు, పడవ వెంట పడవ మారు పలికాయి.

"అరే నాగన్నా!" "అరే నాగన్నా!" "అరే నాగన్నా!" నాగన్న త్రుళ్ళిపడి లేచాడు. ఒళ్ళు విరుచుకుంటూ బైటికి వచ్చి గట్టుమీదికి దుమికాడు. దూలం అక్కడే వుంది నిర్లక్ష్యంగా. కాని, రంగడు సత్తి దేహాన్ని భుజాన వేసుకుని వస్తున్నాడు.

నాగన్న నోట మాటరా లేదు. దూలంమీద నెమ్మదిగా కూచుని, గుమిగూడుతున్న సరంగుల వంక చూస్తూ విగ్రహం లా వున్నాడు. గుంపు మధ్యకు రానే వచ్చాడు రంగడు. మెల్లగా గుంపులోకి త్రోసుకుని వస్తున్న పిల్లవాణ్ణి పక్కకు పిలిచి ప్రశ్నించింది పడుచుపిల్ల. జవాబివ్వకుండానే వాడు మనుషుల కాళ్ళమధ్యగా దూరి లోపలికి వచ్చి శవం ప్రక్కన కూర్చున్నాడు.

తెల్లని వెచ్చని ఎండ సత్తి మొహం మీది తడి పీల్చుకుంటోంది. కడుపు తిత్తిలాగు ఉబికింది. ఆడుగున బట్టలు పరిచారు. గుంపులో తలకొక మాటగా అనవడం మొదలెట్టారు.

"గొడ్డుముండా కొడక! నాలుక్కోసులు కావాలంటే మాదగ్గి రేడవక పొయ్యావా" అన్నాడు లాంచెం బలిసిన మోటారు బోటు మేస్త్రి.

"రాత్రి కుండపోతగు రుస్తుంటే ఏమని పొయ్యావ్రా! బుద్ధిమాలినోడా"

"తొంగుంటే నా అబ్బసొమ్మెవడు తిన్నాడ్రా"

రంగడు కళ్ళనుంచి నీరు జారిపోతూనే వుంది. శవాన్ని గోదావరి నీటితోనే గాయాలు కడుగుతున్నాడు:

"గబ్బగియాంలో ఏం బాఫు కుందామని!"

రంగడు నిస్పృహతో నాగన్న మొహం వంక చూశాడు. నాగన్న దేహం నిండా ముడతలు ఆ క్షణానే ఎక్కువైనట్లు కన్పించాయి. కళ్ళెత్తి, చూచి, తల దించేసుకున్నాడు. తను కూచున్న దూలాన్ని చేతితో చరచి, "ఉప్పలేక చస్తుంటే గుప్పెడు పెట్టిన నాయాలు లేడు" అని గట్టిగా రాతితో కొట్టినట్లన్నాడు. గుంపు నిశ్శబ్దంగా నాగన్నని చూచి తలలు వాల్చుకున్నది. దూలం నిర్లక్ష్యంగా నీటిఊటలు కక్కుతున్నది.

గుంపుబైట మునికాళ్ళమీద నిలబడి లోపలికి తొంగి చూసిన పడుచుపిల్ల మొహం హఠాత్తుగా నల్లబడింది. తలలో మల్లెపూల శేరు వాడిపోయింది. పిల్లవాడు శవం కాళ్ళవద్ద పరిశీలనగా చూస్తూ, రెండు వేళ్ళతో నిప్పును తాకినట్లు శవాన్ని తాకి, ఒక్కసారి ఏడ్వ ప్రారంభించాడు. పడుచుపిల్ల సహించలేక నాల్గడుగులు పక్కకువేసి, గుడ్డిదానివలె గాలిలో తడుముతూ వెళ్ళిపోయింది.

గుంపు కళ్ళు చెమ్మగిలాయి. నాగన్న విగ్రహం ఏ క్షణాన దుఃఖంతో విరిగి పోతుందో అన్నట్లుంది. ఇంతసేపూ తను గోదావరికేసి చూస్తున్నాడు. వెక్క

షము, అసహ్యము, కసి పురి గొని బాధిస్తున్నాయి.

గుంపులో ఎవరో "వచ్చారు:" అన్నారు బిగ్గరగా.

నాగన్న తలవిప్పి, కళ్ళెత్తి చూశాడు. గొడుగు పట్టుకుని గుమస్తా, గ్లాస్కో-కట్టుకుని షాహుకారు.

నాగన్న పళ్ళు బిగించి "లంజ కొడుకులు!" అన్నాడు.

ఎండ వేడెక్కుతోంది. ఆ గుంపు మెల్ల మెల్లగా పలచ బడుతోంది. అఖండ గోదావరి లాగే, పట్న జీవితం నిర్విచారంగా సాగి పోతున్నది!





తిరువానూరు కుడ్య చిత్రాలు



తిరువానూరు కుడ్య చిత్రాలు



తిరువానూరు కుడ్య చిత్రాలు

# ప్రకృతిశిల్పి భగీరథి

శ్రీ సంజీవ దేవ్

ప్రకృతిని పూర్తిగా అనుకరించటం ఉత్తమ శిల్పసృష్టి కాదనేది సత్యమే. అయితే ప్రకృతిని పూర్తిగా నిరాకరించటం కూడ ఉత్తమ శిల్పసృష్టి కాదు. ప్రకృతిఅనుకరణ నిరాకరణల సంపూర్ణ సమ్మేళనమె నిజమైన శిల్పసృష్టి. కేవలం బాహ్యజగత్తునే సర్వంగా భావించి దాని ప్రతిబింబాలనే నిజమైన శిల్పం అనుకోటంలో ఎంత అసంపూర్ణత వుందో, కేవలం అంతర్జగత్తునే సర్వంగా భావించి దాని కల్పనా రూపాన్నిమాత్రమే ఉత్తమ శిల్పం అనుకోటం లోనూ అంతే అసంపూర్ణత నిండి ఉంది. ఈ అంతర్బహిర్ జగత్తుల లయమయ సమ్మేళనమే ఉత్తమ శిల్పసృష్టి. బాహ్య ప్రకృతి పైన ఎంతవరకాధార పడాలో, ఆంతరిక భావాలపైన ఎంతవరకాధారపడాలో శిల్పి యొక్క స్వేచ్ఛపైన ఆధారపడి ఉంటుంది. ఇలాంటి స్వేచ్ఛతో ప్రాణస్పందనంతో నింపిన ప్రకృతి దృశ్యాలను చిత్రిస్తారు శ్రీ భగీరథి గారు.

ఆంధ్ర చిత్రకారుల్లో అసమాన ప్రజ్ఞావంతులున్నారు. కాని వీరిలో కేవలం ప్రకృతిదృశ్యాలనే చిత్రించేది ఒక్క భగీరథి గారు మాత్రమే అసలు ఆధునిక భారతీయ చిత్రకళలో గాని, ప్రాచీన భారతీయ చిత్రకళలో గాని కేవల దృశ్యకళకు అంతగా వ్యాప్తి లేదని అంగీకరించాలి. ఆధునిక భారతీయ చిత్రకారుల్లో కొందరు చాల ఉత్తమ ప్రకృతి చిత్రకారులున్నారు, అన్ని రాష్ట్రాల్లోనూ. కాని ప్రాచీన భారతీయ చిత్రకళలో మాత్రం కేవల ప్రకృతిదృశ్యాలు మాత్రం గోచరించవనేది సత్యమే. *

భగీరథిగారు రంగుల రమ్యకాంతులను ప్రదర్శించటంలో సిద్ధహస్తులు. పూర్వ దిగంతం లోని ఉషః కాంతులనూ, పశ్చిమాకాశం లోని సాంధ్యరాగాన్ని సృష్టించటంలో విఖ్యాత పాశ్చాత్య ప్రకృతిశిల్పి యగు టర్నర్ కు ఏమాత్రం తీసిపోరు అనటంలో అతిశయోక్తిగాని, ఆంధ్రాభిమానం గాని

* ప్రకృతి చిత్రాల ఉదంతాన్ని తెలిపే ఇదే రచయితయొక్క 'దృశ్యచిత్రాలు' అనే వ్యాసాన్ని క్రిందటి కార్తీక మాసపు ఆంధ్రశిల్పిలో చూడనగును.

ఎంతమాత్రమూ లేవు. హేమంతం లోని అస్పష్ట హిమదృశ్యాలను, శరత్తు లోని నిర్మల నీలదృశ్యాలనూ ఒక సరిక్రొత్త రూపంలో చూపుతుంది ఆయన కుంచె. వివిధాకారాల రాళ్ళతో కూడిన కొండ రూపాలు భగీరథిగారి చిత్రాలలో విచిత్రంగా గోచరిస్తాయి. ప్రకృతిని చిత్రించబోయే ముందు దృశ్యాన్ని ఏవిధంగా రసదృష్టితో వీక్షించాలో, ఆ వీక్షించిన దృశ్యాన్ని ఏవిధంగా ముందు చిత్తంలో పోతపోయాలో, చివరకు ఆ చిత్తంలోని దృశ్యాన్ని చిత్రంలోనికి ఏవిధంగా రూపాంతరం చేయాలో భగీరథిగారికొక ప్రత్యేక నైపుణ్యంతో తెలుసు.

భగీరథిగారి జననం ౧౯౨౧లో, అనకాపల్లి దగ్గర మామిడిపాలెంలో. విచిత్రమేమంటే భగీరథిగారి జన్మస్థలం కొండలతోనూ, పెద్దపెద్ద రాతిబండలతోనూ నిండివున్న ప్రదేశం. ఆ రాతి బండలనూ, ఆ కొండలనూ చిత్రించటంలో భగీరథిగారు అసమాన ప్రజ్ఞావంతులైనారు. భగీరథిగారు జన్మించిన సమయం సంజకెంజాయలతో వెలుగుతున్న సాయం సమయము. అలాంటి సంజకెంజాయలను భగీరథిగారు విశేష నైపుణ్యంతో చిత్రిస్తారు. పుట్టిన పరిసరాల వంటి శిల్పిగా తయారు కావటం తమాషా అయిన సమన్వయమే. వికసించే కాని శిశుచైతన్యం మీద పరిసరాల ప్రభావం ఏవిధంగా పనిచేస్తుందో మనోవైజ్ఞానికులకే ఎరుక.

బాల్యం నుండీ భగీరథిగారి లేతహృదయం ప్రకృతిలోని ఆనందమయ దృశ్యాలను చూచి పొంగిపోతూ ఉండేది. కవి వర్డ్స్‌వర్త్ ప్రకృతి సౌందర్యంలో లీనమైపోయినట్లే శిల్పి భగీరథికూడ ప్రకృతి దృశ్యాలతో తాదాత్మ్యం పొందేవారు. ఉదయపు మంచుతెరలో గుండా దూరాన అస్పష్టంగా గోచరించే ఒక పర్వతశిఖరమో, తొలకరి సంజ వేళల్లో పశ్చిమోత్తరా కాశంలో తేలి వచ్చే ఒక మేఘఖండమో, ఘనీభవించే చీకటిలో ఛాయామూర్తిలాగా దూరాన నిలచి వున్న ఏ తాటిచెట్టో, సెలయేటి తీరాన గాలికి ఊగే ఏ గడ్డిమొక్కో, వెన్నెల రాత్రిలో వృక్షాలు లేని ఏ ఎడారిలోని అనంత దిగంతమో భగీరథిగారి కిశోర హృదయాన్ని స్పృశిస్తూ రసాస్వాదం చేస్తూనేవుండేది.

ఏదో కొంత ప్రాథమిక సాధన జరిగిపోయిన తరువాత భగీరథిగారు బొంబాయి వెళ్ళి అచ్చటి శిల్పవిద్యాలయంలో కొంతకాలం శిల్పసాధన సాగించి అనారోగ్య కారణాల వల్ల అచ్చటి విద్యాభ్యాసాన్ని అసంపూర్ణంగానే వదలివేసి, ఇంటికి తిరిగివచ్చి స్వయం

కృషితోనే చిత్రసాధన చేయసాగారు. ప్రథమంలో భగీరథిగారు ప్రకృతి చిత్రాలనే కాక మానవుల రూపపటాలను కూడ తైలవర్ణాలలో చిత్రించేవారు. కాని క్రమేణా వీరి అభిరుచి కేవల ప్రకృతి చిత్రాలవైపుకే మళ్ళించుకొని రూప పటాలను వ్రాయటం మానివేసి కేవల ప్రకృతి ఆరాధకులుగా మారిపోయినారు.

౧౯౩౮ లో ప్రత్యేకముగా కాన్వాసు మీద రెండు పెద్ద తైలచిత్రాలను "చంద్రోదయం" "సూర్యోదయం" అనే వాటిని పూర్తిచేసి హైదరాబాదులో ప్రదర్శించగా వాటిని అచ్చటి ప్రసిద్ధ చిత్ర సంగ్రాహకుడగు రాజా రాయరాయన్ గారు కొనియుండిరి. ఇంకా అప్పుడప్పుడు వీరు మరికొన్ని తైల చిత్రాలను తయారుచేశారు. కాని వీరి అభిమానం నీటిరంగులమీదనే ఎక్కువ. అందువల్ల వీరి చిత్రాలన్నీ దాదాపు నీటిరంగులవి అనే చెప్పాలి. స్వచ్ఛమైన సూర్యకాంతియుతమైన మనదేశంలోని వాతావరణం స్పష్టంగానూ జ్యోతిర్మయంగానూ చిత్రించటానికి ఉజ్జ్వలమైన నీటిరంగులు ఉపయోగపడినంతగా తైలవర్ణాలు ఉపయోగపడవు.

౧౯౩౨ లో వీరు జయపురంలో ఉండే కొన్ని ఉత్తమమైన ప్రకృతి దృశ్యాలను చిత్రించారు. ఇవన్నీ విజయనగర మహారాణీ సంగ్రహించి భగీరథిగారిని గౌరవించినది. భగీరథిగారిని ప్రోత్సహించినదీ గౌరవించినదీ అంతా రాజులూ, రాణీలూ, గవర్నర్లూ, గవర్నరు సతీమణులూ మాత్రమే అయినప్పటికీ భగీరథిగారు ధనవంతులుగా మారలేకపోయినారు. ఇది వారిలోని ఒక మహోన్నత సుగుణం. వారిహృదయం ఎల్లప్పుడూ సామాన్య ప్రజలపైనే గాఢాభిమానంతో ఉంటుంది.

భగీరథిగారు ౧౯౩౮ లో తిరువాన్కూరు పర్యటన సాగించి అచ్చటి మధుమయ ప్రకృతిని సుందర చిత్రాలలో లిఖించారు. ఆసమయంలో వీరి చిత్రప్రదర్శనం కూడ అచ్చట జరిగింది. రాజపరివారం వీరికొన్ని చిత్రాలను తీసుకొని గౌరవించారు. భగీరథిగారి చిత్రాలు అనేక పతకాలను కూడ పొందినవి కొన్ని ప్రదర్శనాలలో.

భగీరథిగారి ప్రకృతి చిత్రాలకు ఒక ప్రత్యేకత ఉండటానికి కారణం వారి వాస్తవ జగత్తును కావ్యంగా చూసే రసమయ కవిహృదయమే. ఈ హృదయ సత్త్వాను భోదము భగీరథిగారికి రంగుల మర్మంలో బాగా అనుభవం ఉన్నది. రెండు వ్యతిరేక వర్ణాలను సమన్వయం పరచటంలో వీరి కౌశలం ప్రత్యేకంగా గోచరమవుతుంది. వీరి

వర్ణవిన్యాసం జంత్రసంగీతం లాగా మానసిక ప్రకంపనలను రేకెత్తిస్తుంది దర్శకుని హృదయంలో వీరి రంగులసొంపు హృదయానికెంత రసతరంగాలను చేకూరుస్తుందో కంటికి కూడ అంత హాయిని ఇస్తుంది.

భగీరథిగారి పాపికొండల దృశ్యాలు ప్రఖ్యాత శిల్పులగు రోరిక్ గారి హిమాలయ దృశ్యాలవలె గోచరిస్తవి. ఈ ఉభయులకూ రూపాన్ని సృష్టించటంలో చాల ప్రభేదం కన్పిస్తున్నా రంగులను చిత్రించటంలో మాత్రం చాల సామ్యం గోచరిస్తుంది. అయితే రోరిక్ జన్మతః పాశ్చాత్యుడైనప్పటికి ప్రాచ్య సంప్రదాయాలను ఎక్కువగా తన చిత్రాల్లో ప్రదర్శిస్తాడు. అందుకు విరుద్ధంగా భగీరథిగారు ప్రాచ్యులయినప్పటికి తమ చిత్రాల్లో పాశ్చాత్య పద్ధతులను ఎక్కువగా ప్రదర్శిస్తారు. ఇది సహజంకూడా. వ్యతిరేకతలలోనే ఉంది విచిత్రం.

భగీరథిగారి ప్రకృతి చిత్రాలు పాశ్చాత్య శైలి ననుసరించే ఉంటవి అనే యదార్థాన్ని స్వీకరించకపోతే అదొక అంధ దేశాభిమానం అనాలసి వుంటుంది. వీరి చిత్రణ పాశ్చాత్య శైలిలో ఉంటుంది అన్నంతమాత్రం చేత వీరి ప్రతిభకు ఏవిధమైన అల్పత్వాన్ని కాని, విదేశ వ్యామోహాన్ని కాని అంటకట్టాలసిన అవసరం కూడ గోచరించదు. శిల్పియొక్క సృజనశీలత తన స్వంత ప్రేరణమీదనే ఆధారపడి ఉంటుంది కాని, అది విదేశీ, ఇది స్వదేశీ అనే జాత్యభిమానాలపైన ఆధారపడి ఉండదు. అదీకాక యీ నవ యుగంలో, శిల్ప క్షేత్రంలోనూ జీవన క్షేత్రంలోనూ కూడ స్వదేశీ విదేశీ అనే వాటికి క్రమేణా తారతమ్యం అంతరించి ఒక ఏకజగత్తుగా పరిణమిస్తుంది. నేడు మనం భారతీయ కళ అనే దానిలో కూడ భారతీయత్వం పేరుకు మాత్రమే గోచరిస్తుంది. శిల్పి తన ఇష్టంవచ్చిన పద్ధతిలో సృష్టిని సాగించుకొనే స్వేచ్ఛ కలిగి ఉంటాడు.

భగీరథిగారు పెద్ద పెద్ద చిత్రాలను వేసినంత ప్రావీణ్యంతోనే చాల చిన్న చిన్న చిత్రాలను, కార్డుసైజులో సగం మాత్రమే వుండే చిత్రాలను కూడ చిత్రిస్తారు. ఈ చిన్న ప్రకృతి చిత్రాలు రంగులలో మిరుమిట్లు గొల్పుతూ మణిదీపాలవలె ప్రకాశిస్తుంటవి. వీటిని రంగుల భావగీతాలనవచ్చు.

భగీరథిగారి కొన్ని చిత్రాలు: "సుఖమయ ప్రభాతం," "సాంధ్యరాగం," "కొండలూ గుట్టలూ," "మంచులోని లోయ," "అవసానం," "మిత్రులు," "ఒక మంచు తెర," "ఆరమా పర్వతం," "మాడుగుల మార్గంలో," "స్నూదికొండవద్ద," "అస్తమయ కాంతి" మొదలయినవి. ప్రాతఃకాలీన

హిమదృశ్యాలనూ, అవలీలగా అస్పష్టంగా ఛాయారూపాలుగా గోచరించే వస్తు సముదాయాన్ని చాలా బాగా చిత్రిస్తారు. "మంచులోని లోయ" అనే చిత్రంలో మంచుతో నిండిన అస్పష్ట నీలధూసరవర్ణం మృదువుగానూ స్పర్శసుఖం ఇస్తున్నట్లూ కనిపిస్తుంది.

భగీరథిగారి చిత్రాల్లో వాస్తవ చిత్రణతోడు వ్యంజన (Suggestion) కూడ గోచరిస్తుంది. ఈ వ్యంజన చిత్రంలోని భావాన్ని అనుమానింప చేస్తుంది. "అవసానం" అనే చిత్రంలో సూర్యాస్తమయం అయిపోయింది; తరువాత పశ్చిమాకాశంలో వెలిగే రక్తకాంతి వుంటుంది; సమ్ముఖభాగంలో ఒక ఎండిపోయిన చెట్టు పడిపోయి వుంటుంది. సూర్యాస్తమయం చెట్టుయొక్క అవసానాన్ని, పడిపోయిన చెట్టు సూర్యుని అవసానాన్ని బలపరుస్తాయి. అందువల్ల భగీరథిగారి ప్రకృతిదృశ్యాలు కేవలం సుందరదృశ్యాలు మాత్రమే కాక భావమాధుర్యంలో సజీవమైఉంటాయి. అయితే ఆధునిక చిత్రకళలో భావవ్యక్తీకరణకంటె రూప పరిస్ఫుటత్వానికే అధిక మూల్యం. అయినప్పటికీ భగీరథిగారి వ్యంజన ఆయన రూపకల్పనకు ఏమాత్రమూ అడ్డురాదు.

ప్రకృతిశిల్పికీ దేశాటనకూ అవినాభావ సంబంధం. వివిధ దేశాలూ తిరిగి అందలి రమ్యమైన ప్రకృతిని తిలకిస్తుంటేనే కాని ప్రకృతిశిల్పి హృదయంలో వినూత్న చిత్రకల్పనకు ప్రేరణ లభించదు. భగీరథిగారు ఇంతవరకు దక్షిణాపథంలోని సకల నైసర్గిక ప్రదేశాలనూ దర్శించి చిత్రించారు కాని, వింధ్యప్రదేశాన్ని, హిమాచల ప్రాంతాలనూ దర్శించే అవకాశాన్ని కలిగియుండలేదు. వీలయినంత త్వరలో ఒక పర్యాయం హిమాలయాల్లో పర్యటన సాగించి అనేక సుందర హిమాలయ దృశ్యాలను చిత్రించాలనే ప్రయత్నంలో వున్నారు ప్రస్తుతం భగీరథిగారు.

భగీరథిగారి శిల్పం ద్రాక్షాపాకమే కాని, వీరి జీవితం మాత్రం నారికేళపాకం. వీరి చిత్రాలను ఆనందించినంత త్వరగా వీరి జీవితాన్ని ఆనందించలేం. వీరి నిజమైన రసమయ వ్యక్తిత్వం కొంత ఆలస్యంగా కాని గ్రహించలేం. లలితకళాజీవులకుండే బాహ్య సౌకుమార్యంగాని, ముఖ ముద్రలుగాని, వ్యక్తిగత లాలిత్యంగాని భగీరథిగారి విగ్రహంలో మనకు గోచరించదు. ఇటువంటి సున్నితంగా వుండని వ్యక్తిలో ఇంత రంగుల ఇంద్రజాలాన్ని సృష్టించగల రసహృదయం ఇమిడి ఉన్నది అంటే ప్రథమంలో ఎవరూ

సమ్మజాలరు. కాని భగీరథిగారితో పరిచయం సన్నిహితమైన కొలదీ వీరి అసలు వ్యక్తిత్వం లలితాతిలలితంగా గోచరించ నాగుతుంది. అప్పుడు అనుకుంటాం ఇటువంటి సుందరవ్యక్తిత్వం కలవారు కనుకనే అటువంటి సుందరతమ చిత్రాలను సృష్టించ గలుగుతున్నారని.

నేటి భారతదేశంలో వున్న కొద్దిమంది ప్రకృతిశిల్పులలో భగీరథిగారొకరయినందుకు ఆంధ్రదేశం గర్విస్తుంది. వీరి ప్రకృతి చిత్రాలు ఆంధ్రదేశపు నైసర్గిక దృశ్యాలను మిగతా ప్రపంచానికి చూపటంలో విజయవంతాలవుతాయి అనటంలో సందేహం లేదు.



# చెప్పని సందేశం

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు.

[ప్రకటన– ప్రాచీన చరిత్ర పరిశోధకసమితి వారి కార్యనిర్వాహకవర్గం సమావేశమైంది. బలరామయ్యా, నరసింహం, శ్యామశాస్త్రి మొదలైనవారు రాబోయే వార్షిక సభకు అధ్యక్షుణ్ణి ఎన్నుకోవడం గురించి చర్చిస్తున్నారు.]

బలరా : ఎవరండీ, ఈ రామచంద్రరావు? ఎక్కడా పేరే వినలేదే.

నర : చెన్నపట్టణంలో చదువుకుంటున్నాడు. చాలా చురుకైనవాడని ప్రొఫెసర్ రంగనాథరావుగారు రాశారు.

శ్యామ : కావచ్చును. చరిత్ర పరిశోధనలో తలలు నెరసిన హేమాహేమీలంతా ఉండగా ఒక కాలేజీ విద్యార్థినా అధ్యక్షుణ్ణి చెయ్యడం?

నరసింహం: సభ జరిగే నాటికి అతని చదువు పూర్తి అవుతుంది. విషయం అది కాదు. అధ్యక్షతకి అర్హత ఉందా లేదా అనేదే మనం ఆలోచించాలి.

బలరా : ఎవరికీ తెలియని కొత్త వ్యక్తినా అధ్యక్షుణ్ణి చెయ్యడం?

నర : సరియైన వ్యక్తికి సరియైన అవకాశం ఇస్తే, అతని సామర్థ్యమే అతనికి పేరు సంపాదిస్తుంది.

శ్యామ : ఈ రామచంద్రరావు ఇంతవరకూ చేసిన ఘనకార్యాలేమిటో తెలనిస్తారా?

నర : ప్రొఫెసర్ రంగనాథరావుగారి ఉత్తరంలో ఆ సంగతులేవీ లేవు. రామచంద్రరావు సైన్సు విద్యార్థి అనీ, కవిత్వం రాస్తాడనీ అన్నారు.

శ్యామ : అయితే, అతనికి మన సమితిలో స్థలం లేదు. సాహిత్య పరిషత్తులలో స్థానం వెతుక్కోమనండి.

నర : అలా కాదు మరి. కొసదాకా వినాలి. సైన్సులో, ముఖ్యంగా ధ్వని ప్రసరణలో అతడు చాలా పరిశోధనలు చేసి ఒక కొత్త యంత్రం కనిపెట్టాడట. మన పరిశోధకుల కది తప్పకుండా ఉపకరిస్తుందని రంగనాథరావుగారు రాశారు.

శ్యామ : అయితే ఆ ఉపకారం పొందడానికి అతణ్ణి అధ్యక్షుణ్ణి చెయ్యడమే అవసరమా?

బలరా : మరీ బొత్తిగా కుర్రాణ్ణి అధ్యక్షుణ్ణి చేస్తే సభంతా రసాభాస అయిపోతుంది.

శ్యామ : మొదట, విషయం ఏమిటో తెలుసుకుందాం. చెప్పండి నరసింహంగారూ. ఈ విద్యార్థి కనిపెట్టిన యంత్రం ఏమిటి? అది చరిత్రపరిశోధనకి ఎలా పనికొస్తుంది?

నర : అతడు కనిపెట్టిన యంత్రంతో భూతకా

[ రెండు మూడు క్షణాలు నిశ్శబ్దం. ]

శ్యామ, బల : మాకేమీ బోధపడలేదు.

వర : ఒకసారి ఉచ్చరించినమాట కలకాలమూ గాలిలో ఉంటుంది. ఈ రామచంద్రరావు తన యంత్ర సహాయంతో ఏమాటనైనా పట్టుకోగలడు.

బల, శ్యామ : ఏమిటీ?

వర : ఆశ్చర్యమే ఇది. కాని నిజం!

బలరా : నిజమే అయితే, మన చరిత్ర పరిశోధన పద్ధతులన్నీ తారుమారు కాగలవు. పాండవుల ప్రసంగం వినవచ్చు. కృష్ణదేవరాయల గొంతుక వినవచ్చు. సిపాయీల తిరుగుబాటుకు సంబంధించిన యాథార్థాలన్నీ బైటపడతాయి.

శ్యామ : నా తల తిరిగిపోతోంది. నేనేమీ నమ్మలేకపోతున్నాను.

వర : కాని ఆయంత్రాన్నింకా రామచంద్రరావు నిర్దుష్టం చెయ్యలేదట. భూతకాల ధ్వనులన్నీ గందరగోళంగా ఉంటాయి. అందులో మనకు కావలసిన వాటిని వేరు చేసి, శుభ్రపరచి రికార్డు చెయ్యడం చాలా శ్రమతో కూడుకున్న పని.

శ్యామ : ఆఁ. అలా చెప్పండి. ఇందులో ఏదో మెలిక ఉంటుందని నేనప్పుడే అనుకున్నాను.

వర : శ్యామశాస్త్రిగారూ, ఇది వేళాకోళాలకి సమయం కాదు. రామచంద్రరావు ఛార్లటాన్ కాడు. అతడొక సీరియస్ సైంటిస్టు అని జ్ఞాపకం ఉంచుకోండి. మన సభకు అధ్యక్షత వహించాలని అతనికేమీ ఆదుర్దా లేదు. సత్యాన్వేషణమే అతని కర్తవ్యం.

శ్యామ : అయితే ఆ సత్యాన్వేషణ పూర్తి అయే దాకా కొంతకాలం అతణ్ణి అజ్ఞాతవాసంలో ఉండనివ్వండి. ఆ యంత్రమేదో నిర్దుష్టం చేసిన తర్వాత కావలిస్తే మీదటికి మన సమావేశానికి అతణ్ణి ఆహ్వానిద్దాం.

బలరా : అలా కాదు. రంగనాథరావుగారి సిఫారసును మనం తృణీకరించకూడదు. తుని తగవుకింద నేనొక మార్గం సూచిస్తాను. ఈ యేడు మన సభకతణ్ణి ఉపన్యాసకుడుగా రమ్మని పిలుద్దాం. ఆయంత్రాన్ని తెచ్చి అతడు తన సిద్ధాంతాలన్నీ వివరిస్తూ ఉపన్యసించవచ్చు.

వర : యంత్రం ఎలా తేగలడు? ఇంతవరకు అతడు శుభ్రపరచిన కొన్ని రికార్డులు మాత్రం తెస్తాడు. అయినా అతణ్నే అధ్యక్షుణ్ణి చెయ్యాలని నా ఉద్దేశం.

బలరా : నా మాట వినండి. ఈ యేడికిలా పోనివ్వండి. ప్రతిభావంతులైన యువకులకు అవకాశం ఇవ్వవలసిందే కాని-

వర : వీల్లేదు. అతని సామర్థ్యంలో మీకు సందేహం లేనప్పుడు, ఈ తిమ్మి కాగణాలతో పనేమిటి? రామచంద్రరావే అధ్యక్షుడు.

## చెప్పని సందేశం

కథనం: ప్రాచీన చరిత్ర పరిశోధక సమితివార్షికోత్సవం ప్రారంభమయింది. అప్పుడే ఒకానొక వూళ్ళో-ఏవూరు? ఏదో గొప్ప పట్టణమే. ప్రాచీన శిథిలాలకు పేరుపడ్డ పట్టణం. బహుశా బళ్ళారినగరం కావచ్చును. లేదా రాజమహేంద్రవరమేమో. అమరావతి కాదు. ఎందుచేతనంటే అక్కడ శిథిలాలే తప్ప పట్టణం లేదు. విశాఖపట్టణం కూడా కాదు. అది నవీన యాంత్రిక నాగరికతవల్ల ప్రాముఖ్యం లోకి వచ్చిన పట్టణం. మన పరిశోధక ప్రముఖులకు ప్రాచీన స్మృతులూ నవీన సౌకర్యాలు కూడా కావాలి. అంచేత రెండూ దొరికే ఊరు చూసుకున్నారు. సరే ఊరేదయితేనేం. సభ జరిగింది. ఆహ్వాన సంఘాధ్యక్షుడి ఉపన్యాసం ఇంతకు ముందే పత్రికలకు వెళ్ళిపోయింది. అచ్చు ప్రతిని అతడు చూసి చదివేశాడు. అందులో మామూలు మర్యాదమాటలు తప్ప మరేవీ లేవు. తర్వాత అధ్యక్షోపన్యాసం. రామచంద్రరావు వేదికమీద నించి లేచాడు. సభాసదులకు నమస్కరించాడు. ఇరవై యేళ్ళకంటె ఎక్కువ వయస్సుండదు. తెలివితేటలు ఉట్టిపడే ముఖం.

అధ్యక్షుడు లేచి నిలబడగానే వాద్య సంగీతం ప్రారంభమయింది. ఇదేదో కొత్తరకం ఉపన్యాసమని కొందరనుకున్నారు. ఉపన్యాసానికి బదులు వాద్య సంగీతంలో గొంతుకలిపి రామచంద్రరావు ఇలా పాడాడు.

ఏ దేశ చరిత్ర చూచినా,
ఏమున్నది గర్వకారణం ?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.
నరజాతి చరిత్ర సమస్తం
పరస్పరాహరణోద్యోగం
నరజాతి చరిత్ర సమస్తం
రణరక్త ప్రవాహసిక్తం
బీభత్స రస ప్రధానం
పిశాచగణ సమవాకారం
నరజాతి చరిత్ర సమస్తం
దరిద్రులను కాల్చుకు తినడం
బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు !
నరహంతలు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి.
రణరంగం కాని చోటు భూ
స్థలమంతా వెదకిన దొరకదు
గతమంతా తడిసె రక్తమున,
కాకుంటే కన్నీళులతో.
చల్లారిన సంసారాలూ,
మరణించిన జనసందోహం,
అసహాయుల హాహాకారం
చరిత్రలో మూలుగుతున్నవి.
వైషమ్యం స్వార్థపరత్వం

కౌటిల్యం ఈర్ష్యలు స్పర్థలు,
మాయలతో మారుపేర్లతో
చరిత్రగా నిరూపించినవి.
జంఘిజ్‌ఖాన్ తామర్లేనూ,
నాదిర్షా, ఘజ్నీ, ఘోరీ,
సికందరో ఎవడైతేనేం ?
ఒకొక్కక్కడూ మహా హంతకుడు.
వైకింగులు శ్వేతహూణులూ,
సిథియన్లూ, పారశీకులూ,
పిండారులు, ఠగ్గులు కట్టిరి
కాలానికి కత్తుల సంతెన.
అజ్ఞానపు అంధయుగంలో
ఆకలిలో ఆవేశంలో
తెలియని ఏతీవ్రశక్తులో
నడిపిస్తే నశిచి మనుష్యులు
అంతా తమ ప్రయోజకత్వం
తామే భువి కధినాధులమని
స్థాపించిన సామ్రాజ్యాలు
నిర్మించిన కృత్రిమచట్టాల్
ఇతరేతర శక్తులు లేస్తే
పడిపోయెను పేక మేడలై.
పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను.
చిరకాలం జరిగిన మోసం
బలవంతుల దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా ఇకపై చెల్లవు!
ఒక వ్యక్తిని మరొక వ్యక్తీ
ఒకజాతిని వేరొక జాతీ
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా ఇకపై సాగదు.
చీనాలో రిక్షావాలా
ఐర్లాండున ఓడకళాసీ
అణగారిన ఆస్త్రులందరూ
హాటెన్‌టాట్ జూలూ నీగ్రో
ఖండాంతర నానాజాతులు
చారిత్రక యథార్థతత్వం
చాటిస్తారొక గొంతుకతో
ఈ యుద్ధం ఎందుకు జరిగెను ?
ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో ?
తారీకులు దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం
ఈ రాణీ ప్రేమపురాణం
ఆ ముట్టడికైన ఖర్చులూ
మతలబులూ కైఫీయతులూ
ఇవి కావోయ్ చరిత్ర సారం
ఇతిహాసపు చీకటి కోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు
దాచేస్తే దాగని సత్యం.

# చెప్పని సందేశం

నైలునది నాగరికతలో
సామాన్యుని జీవన మెట్టిది ?
తాజమహల్ నిర్మాణానికి
రాళ్లెత్తిన కూలీ లెవ్వరు ?
సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహస మెట్టిది ?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్
అది మోసిన బోయీ లెవ్వరు ?
తక్షశిలా పాటలీపుత్రం
మధ్యధరా సముద్రతీరం
హారప్పా మొహంజొదారో
క్రోమాన్యాన్ గుహాముఖాల్లో
చారిత్రక విభాతసంధ్యల
మానవకథ వికాసమెట్టిది ?
ఏ దేశం ఏ కాలంలో ఆ
సాధించిన దే పరమార్థం?
ఏ శిల్పం ఏ విజ్ఞానం ?
ఏ శాస్త్రం ? ఏ గాంధర్వం ?
ఏ వెలుగులకీ ప్రస్థానం ?
ఏ స్వప్నం ? ఏ దిగ్విజయం ?

ఉపన్యాసం పూర్తి అయిందన్న సూచనగా అధ్యక్షుడు సభకు మళ్లీ నమస్కరించి కూర్చున్నాడు. ఇదేం ఉపన్యాసమని సభంతా పెద్ద గొడవ అయిపోయింది. మాకు గొప్ప అవమానం జరిగిందని కొందరు ప్రతినిధులుగా వచ్చిన పెద్దలు సభాభవనం నుంచి నిష్క్రమించారు. నేటి వచనయుగంలో పద్యాలేమిటని పత్రికా విలేఖరులు అధ్యక్షోపన్యాసాన్ని తమ తమ పత్రికలకు పంపించడం మానివేశారు. గందరగోళంతో సభ ముగిసింది.

ఆరాత్రి విడిదిలో కార్యనిర్వాహకవర్గ సభ్యులు మళ్లీ తీవ్ర ఆలోచనలలో పడ్డారు.

బలరాం: నేను ముందే చెప్పాను. బాలనాయకం బహునాయకం మన ఆంధ్రదేశానికి శాపం!

నర: ఇప్పుడేమంత పుట్టి మునిగింది. ఇవాళ్టి సభ దిగ్విజయంగానే జరిగింది. రేపు మరీ అమోఘంగా ఉంటుంది.

శ్యామ: సభకు వచ్చిన పెద్దపెద్దవాళ్లంతా వెళ్ళిపోయారు.

నర: పోతే వాళ్ళ ఖర్మం. ఉన్నవాళ్లతోనే కార్యక్రమం నడిపిస్తాం.

బలరాం: మనకి నలుగురిలోనూ నగుబాటు తప్పదు.

నర: ఇవాళ జరిగిన దాంట్లో నాకేమీ అనాచారం కనబడ్లేదు.

శ్యామ: ఊళ్లో అంతా ఈ ఐతిహాసిక సభ అసందర్భప్రలాపసభగా మారిందనుకుంటున్నారు.

నరసింహం: రామచంద్రరావు తన ఉద్దేశాలను ఆ విధంగా తప్ప ఇంకోకలాగ వ్యక్తీకరించలేక పోయాడేమో ?

శ్యామ: అదుగో అధ్యక్షులవారే దయచేస్తున్నారు. ఆ మాటేదో ఆయన్నే అడగండి.

రాము: (ప్రవేశించి) ఏమిటో నా విషయమై మాట్లాడుతున్నట్లుంది!

శ్యామ: మరేం! మీ అధ్యక్షోపన్యాసం గురించి. అది చాలామందిని అవమాన పరచిందని మీకు తెలియదనుకుంటాను.

రాము: నేను చిత్తశుద్ధితో నిజమని నమ్మినదాన్ని బయట పెట్టాను. అది కవిత్వరూపంలో బైటికి వస్తే నా లోపం లేదు. ఆ రూపం చూచి కొందరు జడుసుకుంటే నా తప్పు కాదు.

నరసింహం: మనం మానవమాత్రులం. రామచంద్రరావులో ఒక దైవాంశ ఉంది. అదిమాత్రం మరచి పోవద్దు.

శ్యామ: నరసింహంగారూ! రామచంద్ర రావుగారిలో మీకు గల నమ్మకం కొనియాడ దగ్గది. వార్షిక సమావేశం రసాభాసమయి పోతే దిగ్విజయంగా జరిగిందని మీరనడమూ, రేపు సభ ఇంతకన్నా రక్తి కడుతుందనడమూ, మానవ స్వభావంలో మీకున్న విశ్వాసానికి నిదర్శనం. కాని యదార్థాన్ని పరిశీలించండి. ఎందరు ప్రముఖులు సభనుంచి నిష్క్రమించారో ఆలోచించండి. చాళుక్య యుగం మీద అథారిటీ, విశ్వపతిగారు. నాయక రాజుల కాలం మీద వెయ్యి పేజీల గ్రంథం రాసిన విద్వాంసుడు, హైద్రాబాదు వాస్తవ్యుడు, గోపాలం, భారతీయ విశ్వవిద్యాలయాలన్నీ అనధికారరీత్యా పరిపాలిస్తున్న సర్వేశ్వరశాస్త్రి, ఒకరేమిటి అనేకులు మన ఉద్యమాన్ని నిరసించి నిష్క్రమించారు. ఇక రేపటి సభలో మనం చెయ్యదగ్గది ఒక్కటే. రామచంద్ర రావుచేత తన కొత్త యంత్రం మీద ఒక థీసిస్ చదివించాలి. ఒకటి రెండు ప్రదర్శనాలు ఇవ్వమనాలి. అప్పుడే మనం నలుగురిలోనూ తలెత్తుకొని తిరగగలం.

రాము: నా అధ్యక్ష ధర్మం నేను నేడే నిర్వహించాను. నా యంత్రం సర్కస్ ప్రదర్శనం కాదు. టిక్కెట్టు పెట్టి వినోదం చూపించడానికి కాదు. సినిమా చరిత్ర మీకు తెలుసుననుకొంటాను.

సోదరులు ఆ యంత్రం కనిపెట్టారు. ఈనాడది పెట్టుబడిదారీ వర్గాల చేతిలో పడి ప్రజా సామాన్యానికి విజ్ఞానం కలిగించడానికి బదులు వారిని దోచుకోడానికే ఒక ఆయుధమయింది. నా యంత్రం ప్రజల సంహారానికి వినియోగించడానికి నే నిష్టపడను.

బలరామయ్య: యథార్థాలను మనం గుర్తించాలి. సభ జయప్రదంగా జరగాలంటే భూతకాలశబ్ద గ్రహణ యంత్రాన్ని ప్రదర్శించడమే మంచిది.

రాము: అదింకా పరిశోధన దశలోనే ఉంది. దానిని మార్కెట్‌లో పెట్టి లాభాలు గుంజుకోడానికి నేను సుతరామూ ఇష్టపడను. ఈ సభల నిమిత్తం నేను కష్టపడి శుద్ధిచేసిన రెండు మూడు రికార్డ్సుమాత్రం తెచ్చాను.

శ్యామశాస్త్రి: ఓ దివ్యంగా వుంది. ఇక కావలసిందేమిటి? వాటినే వేద్దాం. నేను సైంటిస్టును కాను. కవిని అంతకన్నా కాను. కాని నాకు ఒక చాకచక్యం ఉంది. ఎటువంటి పరిస్థితినైనా అనుకూలంగా మార్చుకోగల శక్తి నాకుంది.

పరసిం: రామచంద్రరావూ: నీ దగ్గర ఉన్న రికార్డులేమిటి?

రామ: అతి ప్రాచీన కాలంలో వెలువడ్డవీ ఇటీవలనే వెలువడ్డవీ రెండురకాల ధ్వని రూపకాలు రికార్డు చేశాను. వీటిని శుభ్రపరచడానికి చాలా శ్రమపట్టింది. 'అవిన్నీ, ఇంకొక ముఖ్యమైన రికార్డు ఉంది. అల్లసాని పెద్దన కవి గండపెండేరం తీసుకోవడానికి ముందు కృష్ణదేవరాయల సభలో చదివిన ఉత్పలమాలిక. చాలా జాగ్రత్తగా రికార్డు చేశాను.

శ్యామశాస్త్రి: భేష్! అది వెయ్యి కాపీలు తీసి కాపీ నూరు రూపాయల చొప్పున అమ్మితే లక్ష రూపాయలొస్తాయి.

రామ: శ్యామశాస్త్రిగారూ! సరిగ్గా ఆ దృక్పథానికే నేను విరోధిని. నా పరిశోధనలు మానవజాతి అంతటివీని. వాటిని బజారులో పెట్టి అమ్మడానికి వీలులేదు.

బలరామయ్య: అల్లసాని పెద్దనగారి ఉత్పలమాలిక మీ వద్ద ఉందా?

రామ: వెయ్యమంటారా?

బలరామయ్య: అంటారా అని వేరే అడుగుతారా? అవశ్యం!

రామ: అయితే ఇదిగో! (రికార్డు వేయును)

(చక్రం తిరిగిన చప్పుడు. తర్వాత)

అల్ల: పూఁత మెరుగులున్ బసరు పూఁప
బెడంగులు జూపు నట్టివాఁ
తైతలు? జగ్గునిగ్గు సెనగావలె గమ్మన
గమ్మ నవ్వలెన్
రాత్రియున్ బవల్ మఱపు రాని
హాయల్ చెలియా రజంపు ని
ద్రాతరి తీపులం బలెనె తారసిలన్వలె
లోఁదలంచినన్
బాతిగ పై కొనన్వలెను పైదలి
కుత్తుకలోని పల్లటీ
కూఁతలనవ్వలెన్ సొగసు కోర్కులు
రావలె నాలకించినన్
చేతికొలంది కౌగిటను జేర్చిన కన్నియ
చన్నుఁ బోన్ని మేల్
నూఁతల చన్నదోయివలె ముచ్చట
గావలె పట్టి చూచినన్
డా కొడనున్న మిన్నల మిటారపు
ముద్దుల గుమ్మకమ్మ పొ
వాఁతెఱ దొండపండువలె వాచవి
గావలె పంట నూదినన్
గాతల తమ్మిచూలి దొరకైవసపుం
జవరాలిసిబ్బెపున్
మే తెలియుబ్బరంపు జిగిబిబ్బర పుబ్బగు
గబ్బిగుబ్బ పోం
బూఁతల నున్నగాయ సరిపోఁడిమి

కిన్నరమెట్టుబంధి సం
గాతపు సన్నబంధి బయకారపు
కిన్నర గాత్రకంఠంతా
సాతత తానతానల పసన్ దివ్యహారిదము
గోటిబిరాటుబల్
మోగితలుసన్ బలెన్ హారువు
మొల్లము గావత నచ్చు తెన్గులీ
రీతిగ, సంస్కృతమ్ము బచరించచడి
పట్టున భారతీ వధూ
టీతపనీయగర్భనికరశ్రీ భవదానన
పద్మ సాహితీ
భౌతిక నాటక ప్రకర భారతభారత
సమ్మత ప్రభా
పాత ఘుమంఘుమార్భ బహుబంభంగ
ఘుమంఘుమ ఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మలయసంగతచుంచు
విపంచికా మృదం
గాతత తెపితత్త్రిపింత పథిత ధంధ
మిధాణుధింధుటా
ప్రాలె నయానుసా ల పదవారకు
హాయిద్యహాహా సంకీర్ణ
నూతన ఘల్లు లాచరణ నూపుర
ఝంకారఝళీ మరంద సం
ఘాత వియద్ధునీ చకచక ద్విరచోత్పల
సార సంగ్రహా
యాతకుమార గంధవహహారి సుగంధ
విలాసయుక్తమౌ
చేతము జల్లు సేయవలె జల్లున
జల్లవకాన్ మనోహర
ద్యోతక గోస్తనీఫల మధుద్రవ
గోఘృత పాయస ప్రసా
రాతి రసప్రసార రుచిర ప్రసారమ్ముగ
సారెసారెకున్.

శ్యామశాస్త్రి: శభాస్, బాగుంది. కాని, నాదో చిన్న ధర్మసందేహం తీరుస్తారా? ఇది నిజంగా అల్లసాని పెద్దన్నగారి గొంతుకేనా? లేక ఏ ఆధునికుడి చేతనో చది [illegible] ?

నరసింహం: శ్యామశాస్త్రిగారు బుద్ధికి బృహస్పతిని మించిపోతున్నారు. మీకు ఇలాంటి ధర్మసందేహాలు ఎలాగ కలుగుతాయో ఆశ్చర్యం. రామచంద్రరావు తరఫున మీకు హామీ ఇస్తున్నాను. ఇది ఆంధ్ర కవితా పితామహుడి గొంతుకే! ఈ రికార్డు సహాయంతో పద్యం చదివిన నాటి కాలాన్ని రఘుడిమాలలోనైనా నిర్ణయించ వచ్చును. ఇటలో మరొక్క నడి ఎంత ఉపయోగకరమో మీరే ఆలోచించు కోండి.

రామచంద్రరావు: మానవుడికి ఇతర జంతువులకీ ఉన్న భేదం అంతా భాషలోనే. అట్యాంటి ప్రాచీన కాలపు ధ్వనులను పట్టుకోవడానికి

ఇప్పుడు నా దగ్గర ఉన్నదానికన్నా సున్నితమైన యంత్రం కావాలి. ఇంత వరకు నేను మహాభారత యుద్ధకాలం దాకా వెనక్కి వెళ్లగలిగాను. ఇంకా ప్రయత్నిస్తే మహర్షులు ఋగ్వేదం ఎలా పఠించేది తెలియ గలదు. వానర భాష నుండి అది మానవుల భాష ఏవిధంగా పరిణమించిందో పోల్చుకో వచ్చును. నేను లోకంనుంచి కోరుతున్న దొక్కటే. ప్రశాంతంగా నా పరిశోధనలను సాగించుకోగల అవకాశం. నాకీ అభ్యర్థనలూ వద్దు. సన్మానాలూ వద్దు. పూలదండలూ వద్దు.

బలరామయ్య: మహాభారతయుద్ధసమయపు రికార్డు వేస్తారా?

రాము: అది బ్రహ్మరాక్షస దంపతుల సంభాషణ. మీకు అభ్యంతరం లేకపోతే వినిపిస్తాను.

శ్యామశాస్త్రి: ఎంతమాత్రమూ అభ్యంతరం లేదు.

రాము: అయితే వినండి.

(రికార్డు వేయును)

బ్రహ్మరాక్షసుడు: అయి! ప్రియే చాల శీతే!

బ్రహ్మరాక్షసి: భో భో ఆర్యపుత్ర!

శ్యామశాస్త్రి: అదేమిటా చెప్పను?

రాము: మిగిలిన సంభాషణ దానంతటదే తెలుగులోకి తర్జుమా చేసే కీలకం కనిపెట్టాను.

శ్యామ: మీ యంత్రం నానారాజ్యసమితికి అమ్మితే బాగుంటుందండీ.

రాము: శాస్త్రి గారూ! నేటి పరమాణుయుగంలో కూడా మీరు పాత ధోరణిలో ఆలోచిస్తున్నందుకు విచారంగా వుంది. ఈ యంత్రాన్ని నిర్దిష్టంచేసిన తర్వాత మానవ జాతికి నా బహుమానంగా ఉచితంగానే దీన్ని వదులుకుంటాను. కాని ప్రపంచ ప్రభుత్వాలు వైజ్ఞానికుల పరిశోధనలను మానవ సంహారానికి వినియోగించ రాదని ప్రతిజ్ఞ చెయ్యాలి.

బలరా: ఇదేనా మీ సందేశం?

రాము: నాదేమిటి? ఇది చరిత్ర చెప్పని సందేశం.

శ్యామ: ఆ రికార్డు పూర్తిగా వేశారు కారు.

నరసింహం: బ్రహ్మరాక్షసుల సంభాషణ వినాలని కుతూహలంగా ఉందా?

రాము: వినండి. కురుక్షేత్రంలో ఒక జువ్వి చెట్టు మీద రాక్షసుడు, రాక్షసి. (మరల రికార్డు వేయును.)

బ్రహ్మరాక్షసుడు: ఏం తెచ్చావో చెప్పకో?

రాక్షసి: రక్తం, మాంసం, వస, వప......

రాక్షసుడు: అన్నీ తీసుకు రాలేదు.

రాక్షసి: వాసనపట్టి రక్తం, కేవలం రక్తం. ఇంతేనా నీకు నామీద ప్రేమ.

రాక్షసుడు: వెర్రిదానా! ఇది సామాన్య రక్తం కాదు. ఎంత మధురంగా ఉందో మాడు రుచి మాడు.

రాక్షసి: అభిమన్యుడి రక్తం!

రాక్షసుడు: సహనావవతు. సహనౌభునక్తు.

శ్యామ: ఇక చాలు. ఇక చాలు. రామచంద్రరావు గారూ! మరేదైనా రికార్డు వేయండి.

రామచంద్ర: యుద్ధం ఎంత బీభత్సమైనదో చూపించడానికే, చరిత్రలో జరిగిన ముఖ్యమైన యుద్ధ ఘట్టాల మీదికి నా యంత్రాన్ని తిప్పాను. పానిపట్టు యుద్ధంలో రెండు రాబందులు చేసిన ధ్వనుల రికార్డు నా దగ్గర ఉంది.

శ్యామ: దానికి తెలుగు తర్జుమా వచ్చిందా!

రామ: పశుపక్షి మృగాదుల భాష మానవ భాషల్లోకి పరివర్తనం కాజాలదు. ఇందువల్ల మానవుని విశిష్టత్వం స్పష్టమవుతుంది.

శ్యామ: రామచంద్ర రావుగారూ! ఈ దినం మీరు చేసిన అధ్యక్షోపన్యాసంలో భావం ఇప్పుడిప్పుడే అవగాహన అవుతోంది.

( బేక్‌గ్రౌండ్—ఏ దేశ చరిత్ర చూచినాము. )

రామ: నన్ను మీరర్థం చేసుకున్నందుకు ధన్యుణ్ణి. ఇక నాకు సెలవిప్పించండి. రైలు వేళయిపోతోంది.

బలరామయ్య: అదేమిటి? మీరు సభాధ్యక్షులు, ఇంకా రెండు రోజుల కార్యక్రమం ఉంది.

రామ: ఈ పదవులు నాకనవసరం, నా పరిశోధనాలయంలోకి నన్ను వెళ్ళిపోనియ్యండి.

కథనం: ఆ వెళ్ళిపోయిన రామచంద్రరావు ఏమయిపోయాడో ఎవరికీ తెలియలేదు. మర్నాటి సభలో నరసింహం గారి అధ్యక్షత క్రింద జరిగింది. ఆయన రామచంద్రరావు పరిశోధనలమీద ప్రసంగించారు. కాని ఎవ్వరూ నమ్మలేదు. ఒకటే రామచంద్రరావు పిచ్చివాడైనా అయి ఉండాలి. లేదా నరసింహం ప్రభృతులు కలగసి ఉండాలని పత్రికల వాళ్ళు వ్యాఖ్యానించారు.





తిరువానూర్కరు కుడ్య చిత్రాలు



తిరువాన్కూరు కుడ్య చిత్రాలు



తిరువాన్కూరు కుడ్య చిత్రాలు

# తిరువాన్కూరు కుడ్య చిత్రాలు

శ్రీ కె. పి. పద్మనాభన్ తంపి, బి.ఎ.

భారత దేశంలో మొట్ట మొదట చిత్ర కళాలయాన్ని శాశ్వతంగా స్థాపించిన గౌరవం, పురోగామియైన తిరువాన్కూరు సంస్థానానికే చెందింది. దీనిలో ప్రఖ్యాతమైన భారతీయ కుడ్య చిత్రాలు అనేకమైనవి ఉన్నాయి. ఇవి ఆ సంస్థాన ప్రజల విద్యాభి వృద్ధికీ, కళాభి వృద్ధికీ, ఆనందానికీ, అనేక విధాలుగా సహకరిస్తున్నాయి. ఈ ప్రదర్శనానికి 'శ్రీ చిత్రాలయ' మని పేరు. దీనిలో హైందవభారతీయకుడ్యచిత్రాలప్రదర్శనము కూడా కనిపిస్తుంది. వీటిలో అజంతా, బాఘ్, సిత్తాన వాసల్, తిరువాన్కూరు, కొచ్చిన్, సింహళము, పెర్షియా, మొదలగు ప్రదేశాల నుంచి సేకరించిన చిత్తరువుల సరియైన అనుకరణాలు కూడా చారిత్రకంగా ప్రదర్శింపబడి ఉన్నాయి.

తిరువాన్కూరు కుడ్య చిత్రాలు ప్రప్రథమంగా పరిశీలించిన ప్రఖ్యాత చిత్ర విమర్శకుడు, డాక్టర్ కజిన్సు ఒకచోట ఇలాగ వ్రాశాడు. “కేరళ చిత్ర కళలో కనపడే బౌద్ధ చిత్ర సంప్రదాయాలు ఈకళకూ, అజంతా బాఘ్ చిత్ర కళకు, ఉన్న సంబంధాన్ని విశద పరుస్తున్నాయి. ఈ కుడ్య చిత్రాలలో శక్తి చాలా ప్రస్ఫుటంగా కనబడుతోంది. వాటిలో కనపడే శిల్పము సౌకుమార్యము చాలా ప్రశస్తమైనవి. అవి ఒక పవిత్ర వాతావరణంలో చిత్రించ బడినట్లు మనకు చూచి చూడగానే విశదమౌతుంది. అవి ఆధ్యాత్మికోపదేశం చేస్తూన్నట్లుంటాయి... ఈ చిత్తరువులన్నీ జీవ చైతన్యంతో మెరుస్తూ వివిధములైన భంగిమలతోటి అభినయాలతోటి మనకి చాలా ఆకర్షణగా ఉంటాయి. ఈ చిత్తరువులు రచించినవారు పరిమిత ప్రదేశంలో ఒక ఆకృతి సమ్మేళనము చిత్రించడమేకాక రేఖా వర్ణ విన్యాసాల ప్రకటనలో ప్రతి చిన్న విషయాన్ని ప్రస్ఫుటంగా చిత్రించడములో అత్యంత నిపుణులు. వీరికి సాంకేతిక చిత్రణములో కూడా మంచి నేర్పు ఉంది. ఈ విషయాలే డాక్టరు కజిన్సు కూడా స్పష్టంగా విశద పరిచారు.

శ్రీ చిత్రాలయంలో ప్రదర్శింప బడిన తిరువాన్కూరు చిత్రాల అను కృతులకు

మూల చిత్రాలు పద్మనాభ పుర భవనంలోను, పద్మనాభ స్వామి దేవాలయంలోను ఉన్నాయి. ఈ ప్రదేశాలు చూచిన వారు ఈ కుడ్య చిత్రాల సౌందర్యం చూచి ముగ్ధులైపోతారు. వీటిల్లో దారు చిత్రణాలు తిరువాన్కూరు సంపదకు అత్యంత ముఖ్యమైనవి. అసిత కుమార హాల్దార్ అనే ప్రఖ్యాత భారతీయ చిత్రకారుడు 'కళా జాతీయత' అనే ఉద్గ్రంథంలో ఇలాగ వ్రాశాడు. "కుడ్య చిత్రణము, స్థాపత్యము సోదర కళలు_ అందుచేత కుడ్య చిత్రాలు వాటి ఆకృతులను బట్టి, ఆ చిత్రాలుఉన్న పరిసరాలను బట్టి పరిశీలింప వలసి ఉన్నాయి. భారతీయ కుడ్య చిత్రాలు అవగాహన చేసుకోడానికి ఆ చిత్రాలు చిత్రించిన ప్రదేశంలోనే చూడాలి." తిరువాన్కూరు చిత్రాలు చిత్రించిన మహా శిల్పుల ప్రతిభ అవగాహన చేసుకోవాలంటే వారు గీసిన అనేక రేఖలు మధురమైన వర్ణ సారణ్యము అవగాహన చేసుకోవాలి. ఈ కుడ్య చిత్రాలలో మధుర మధురమైన భావనా కృతులు మహోన్నతమైన ఆదర్శాలు సున్నితములైన వర్ణ రేఖలలో కనిపిస్తాయి. ఇవన్నీ అత్యుత్తమమైనవి. ఈ చిత్రాల ఆకృతులు కవిత వలెను, నృత్తాలు సంగీతము వలెను మనోహరంగా ఉంటాయి. వీటిలో ఎక్కడ చూచినా పవిత్ర భావాలు ఆదర్శాలు ఎదురవుతాయి. మరెన్నో ఈ చిత్రాలలో ఒక అత్యుత్తమమైన మానవాత్మ సౌందర్యము గోచరిస్తుంది; ఐనప్పటికీ వీటిల్లో ఇంద్రియ సౌందర్యము ఆనందమును అభివ్యక్తమౌతూ ఉంటాయి. ఈ చిత్రాలు చిత్రించిన వారు అత్యున్నతమైన సృజన శక్తి కలిగిన మహా చిత్రకారులు. ఈ బొమ్మలలో ఎక్కడ చూచినా జీవకళ ఉట్టిపడుతూ ఉంటుంది. ఈ ఆకృతుల వెనక ఆ జీవకళ ఎంతో అనిర్వాచ్యమై అభివ్యక్త మౌతూ ఉంటుంది. చూచీచూడడముతోనే ఈ చిత్రాలు మనల్ని ఆకర్షిస్తాయి. వీటివల్ల మనకు అఘూతమైన ఆత్మానందము కలుగుతుంది. ఈ చిత్రాలు పరిశీలించడం వల్ల కలిగిన ఆనందము చాలా తీవ్రమై బ్రహ్మానంద సబ్రహ్మచారి యైనది.

తిరువాన్కూరు కుడ్య చిత్రాలు కొన్ని సంస్థాన చిత్రకళా ప్రదర్శనాలయంలో కనుపిస్తాయి. అవి చూస్తే తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానాలలో కుడ్య చిత్రాలు ఎంత అభివృద్ధి పొందింది తెలుస్తుంది. మన ప్రాచీనులు రచించిన ఈ చిత్రాలు పరిశీలించడం వల్ల వారి హృదయాల్లో వున్న సమున్నతాదర్శము, సృజనశక్తి, సౌందర్యము, వ్యక్తమౌతాయి. ఈ కుడ్య చిత్రాలు రచించి ఎంతో కాలమైనప్పటికి అవి నిన్న

మొన్న వేసినట్లు ఉంటాయి. వీటిలో మన ప్రాచీనుల ఆధ్యాత్మిక భావనా శక్తి, అప్పటి కాలపు ప్రాచీన భారతీయ ఆచారాలు చాలా మనోహరంగా చిత్రితమైనాయి. ఈ చిత్రాలు భావనలోను రచనలోను కూడా మహోన్నతమైనవి. వీటి ముఖాలలో గొప్ప మర్యాద కనబడడమే కాక, ప్రబలమైన శక్తి కూడా ప్రత్యక్షమౌతుంది. వాటి అంగవిన్యాసాలు సహజంగాను, లలితంగాను, శక్తివంతంగాను కనిపిస్తాయి. వీటిల్లో భక్తిభావం చాలా గొప్పది. ఐనా వీటి సజీవత్వం ఎంత మాత్రం సన్నగిల్లదు. ఈ చిత్రాలు తిలకిస్తూ వుంటే వీటిలో కవిత్వము, సంగీతము మనకి వినిపిస్తాయి

ఈ కుడ్య చిత్రాలలోని రేఖా చిత్రణకు ఇటలీలో రినైశాన్సు కాలపు చిత్రాలకి చాలా దగ్గిర పోలికలున్నాయి. ఈ చిత్రాలు రచించిన చిత్రకారులకు వర్ణాలలోను రేఖలలోను బైజాంటైను (Byzantine) చిత్రకారుల కున్నంత శక్తి ఉన్నదన్న అతిశయోక్తి కాదు. తిరువాన్కూరు కుడ్య చిత్రాలు రచించిన చిత్రకారులు, భాషకూడా అభివ్యక్తం చేయజాలని అనేక భావాలను రంగులలో స్పష్టంగా చిత్రించారు

ఈ చిత్రాలలో పురుషుల ఆకారాలన్నీ వీరలక్షణాలతో కనిపిస్తాయి. కన్యకలంతా చాలా సొగసుగా ఉంటారు. ఈ కన్యకలు చాలా ఆకర్షవంతమైన అంగ విన్యాసాలతో మాధుర్యం చిమ్ముతూ కవిత్వం ఒలుకుతూ ఉంటారు. ఈ కన్యకలను చిత్రించిన చిత్రకారులు వారి ఆత్మసౌందర్యము, శరీర సౌందర్యము వ్యక్తం చేయడానికి అనేకమైన అంగ విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కుడ్య చిత్రాలు చూచీ చూడడంతోనే హృదయ తంత్రులు ఒక్కసారిగా రాగాలాపన చేస్తాయి. ౧౬ వ శతాబ్దము మొదలుకొని ౧౮ వ శతాబ్దము వరకు ఈ చిత్రాలు చిత్రించారు. వీటిల్లోని వ్యక్తులు పూర్వకాలం నాటైన జీవచైతన్యంతో నవనవ లాడుతూ ఉంటారు. ఈ కుడ్య చిత్రాలలో తిరువాన్కూరు చిత్రకళ పొందిన అత్యున్నత స్థితి మన ప్రాచీనుల సంస్కృతి కనిపిస్తాయి. వీటి శైలిలో ఒక బలమైన శక్తి, స్ఫుటమైన సత్యము కళ్ళకి కొడుతూ ఉంటాయి. ఆబొమ్మలు చూడగానే భయము గౌరవము కలుగుతాయి. వీటిలో కేవలాదర్శాలు జీవితానికి దగ్గిరగా ఉన్న వాస్తవికత ప్రేక్షకులను సమ్మోహింప చేస్తాయి. వీటిలో మానవుల హృదయ భావాలు విశ్వసిద్ధాంతాలు, సైంతర్యము, పరిపూర్ణత, శిల్పము, వర్గీకరణము, ప్రధాన గుణములు

ఇవి ఎంత భావనాశక్తితో చిత్రించబడినవి! ఇవి హైందవ కళకు అత్యున్నత శిఖరాలు ఈ చిత్ర దర్శనము వల్ల మనము అనంతంలో ప్రవేశించి ఆధ్యాత్మికానందం అనుభవిస్తాము. ఈ చిత్రాలవల్ల ఆధ్యాత్మిక శక్తులు జీవితాన్ని పరిపాలిస్తున్నట్లు కనిపిస్తుంది. వీటిలో ఆత్మ సౌందర్యము, విషయ సౌందర్యము విభిన్నములు కావు.

పౌరాణికంగా చూచినా మానవజాతి చరిత్ర పట్టి చూచినా ఈ చిత్రాలు చాలా ముఖ్యమైనవి. ఈ చిత్రాలలో ఆశ్చర్యకరమైన జీవ చైతన్యము, భావోద్రేకము, ధ్యానమగ్నమైన లాలిత్యము, దివ్యగౌరవము, అలంకారసౌకుమార్యము జీవితంతో అత్యంతసన్నిహితత్వము, రంగులలోనిసున్నితమైన లాలిత్యము, బలమైన బిగి, అత్యాశ్చర్యకరమైన పనివాని తనము ఉంటాయని వేరే చెప్పనక్కర లేదు. అధునాతన చిత్రకారులంతా వీటిని చూచి అత్యాశ్చర్యమగ్నులగుతూ ఉంటారు. ఈ చిత్రకారులు కేవలం సామాన్యమైన వర్ణాలతో అత్యద్భుతమైన కుడ్య చిత్రాలు చిత్రించారు. ఈ కుడ్యచిత్రాలన్నీ బ్రహ్మాండమైన చిత్ర ప్రదర్శనాల వంటివి. వీరు తమ కళాశక్తిలో అజంతా బాఘ్ చిత్రకారులకు గానీ ఈజిప్టు రాజుల సమాధి చిత్రాలు చిత్రించిన చిత్రకారులకు గానీ ఇటలీ దేశపు కుడ్య చిత్రాలు చిత్రించిన చిత్రకారులకు గానీ ఎంతమాత్రము తీసిపోరు.

తిరువాన్కూరు కుడ్య చిత్రాలన్నీ హిందూ పురాణ గాథలకు సంబంధించినవి. మనకు ఈ మహా చిత్రకారుల పేర్లు కూడా తెలియవు. వారు తమ పేరు విషయంలో ఏమాత్రం శ్రద్ధ లేనివారులాగ కనిపిస్తారు. తరతరాలనించి వారికి చిత్ర రచన అలవడింది. తిరువాన్కూరు మహారాజు ఒకసారి ఈ చిత్రాలయం తెరుస్తూ ఇలా అన్నారు.

"మనం పురాతన చిత్రాలు చిత్రించిన చిత్రకారులను ఎంతైనా అభినందించవలసినది.

మనకు వారి పేరులేమీ తెలియవు. తమ చిత్రరచనమీద ఉండే ప్రేమవల్ల వారు చిత్రాల కింద తమ పేరులు వ్రాయడం కూడా మరిచి పోయారు. తరతరాల వారికి చిత్రాలు చూచే ఆనందం కలిగించడానికే వారీ చిత్రాలు రచించారు. ఈ చిత్రాలకేసి చూస్తే మనకెంతో భక్తి, గౌరవము కలుగుతాయి. ఇక రాబోయే తరతరాల వారంతా వీటివల్ల అపరిమితమైన ఆనందం అనుభవించగలరు."

ఈ చిత్రాలు రచించి ఎంతో కాలమైనా అవి ఈ నాడు రచింపబడి నట్లుంటాయి. ఇందులో కొన్ని కుడ్య చిత్రాలు చూస్తే వీటిలో హిందూ బౌద్ధ సంప్రదాయాలు కలిసి నట్లు కనిపిస్తాయి. వీటి రేఖల్లో ఒక ఆవేశము, కించిక విసుగు విస్పష్టంగా చూడగలము. సహజ సుందరములైన ఈ రేఖలు అవలోకిస్తే మనకు వాటి కళాపరిపూర్ణత బోధపడుతుంది. యూరపులో మధ్య యుగములోని కుడ్య చిత్రాలు కూడా ఈ గుణమే బాహుళ్యంగా ఉంది ఈ చిత్రాలన్నింటిలోను లయానుగతములైన రేఖలు, మధుర, మధుర ములైన వర్ణ తారతమ్యాలు అలంకార రచనలు, భావగాంభీర్యము, విస్పష్టంగా కనిపిస్తాయి.

దక్షిణ హిందూస్థానములో కుడ్య చిత్రాలు ప్రప్రథమంగా తిరునందిక్కరలో అవతరించి నట్లు తెలుస్తుంది. ఈ తిరునందిక్కర గుహా కుడ్యము మీద శివుడు, పార్వతి, గణపతి, భక్తులతో కనిపిస్తారు. ఈ చిత్రాలు తొమ్మిదో శతాబ్దం ప్రథమ భాగంలో రచింపబడిన వని అంటారు. అజంతా చిత్రాలలోను, వీటిలోను రచనా విధానం ఒకటే. సర్కిన్ కడదోరియన్ అనే ఇటలియా శిల్పి వీటికి చక్కటి నమూనాలు తయారు చేశాడు. అతడు ఈ బొమ్మలను గురించి వ్రాస్తూ పరిపూర్ణత ఒక్కటే వీటిని గురించి అనవలసిన మాట అన్నాడు. వీటి రంగులు చాలా స్పష్టమైనవి. ప్రతీ విషయానికి ఆయా వర్ణాల సమ్మేళనము బాగా కుదిరింది. వీటిలో పనివాడితనం సుస్పష్టము. ఈ చిత్రాలన్నీ తిరువాన్కూరు చిత్రకారులు వ్రాసినవే. ఈ ప్రాచీన చిత్రాలు మనమావిష్కరించుకోవడం చాలా గొప్ప విషయం. వీటివల్ల తిరువాన్కూరు ప్రభుత్వం భారతీయ చిత్రకళా చరిత్రానికి ఒక నూతన అధ్యాయం సమకూర్చ గలిగింది.

నటరాజు తిరువాన్కూరు కుడ్య చిత్రాలలో చాలా అత్యాశ్చర్య కరమైనది. ఇది ఎట్టుమానూరులో గోపురంమీద చిత్రించబడిఉంది. ఇది ౧౬ వ శతాబ్దంలో చిత్రించ బడిందని అంటారు. నిరంతరమైన స్పందానికి ఇది ఒక చిహ్నము. ఇది భారతీయ కళలో అత్యద్భుతమైన చిత్రము పరమేశ్వరుని తాండవ నృత్యానికి ఇది అత్యద్భుతమైన సృష్టి.

ఈ విషయంలో ఇ. బి. హావల్ ఇలా అంటున్నాడు. "అత్యద్భుతమైన ప్రపంచ చిత్ర సృష్టిలో శివుని తాండవలాస్యము ఒకటి. శివుడు విశ్వాంతర్యామి. అతడే ప్రపంచంగా అవతరిస్తాడు. సృష్టిస్థితి ప్రళయా

లు అతని లీలాఖేలలు. అదే అతని నిరంతర నృత్యము. ఆతడీ నృత్యము దేవతలందరి ఎదట చేస్తాడు. అతని చేతిలో డమరుకము ఉంది. ఆడమరుకము లయ చిహ్నాహ్నము.”

నటరాజ కుడ్య చిత్రములో ఈ శివ నృత్యము వర్ణితమై ఉంది. సుప్రసిద్ధ కళా విమర్శకుడు ఆనంద కుమారస్వామి. ఈ చిత్రం చూచి ఇది ద్రావిడ చిత్రకళలో ప్రప్రథమ చిత్రమని అన్నాడు. సర్ విలియమ్, రాథెన్ స్టీన్, అనే సుప్రసిద్ధ పాశ్చాత్య చిత్రకళా విమర్శకుడు ఈ చిత్రమును చూచి భారతదేశం ప్రపంచానికి అందిచ్చిన అత్యుత్తమ చిత్రాలలో ఇది ఒకటి. అని అన్నాడు ఈ చిత్రము వలయాకారముగా ఉంది. నర్తకుని లలిత నృత్య భంగిమల వల్ల చిత్రానికి ఒక అత్యద్భుత ఆకర్షకత్వం ఏర్పడింది. చిత్రంలో పనివాడితనం కూడా అతిసున్నితంగా ప్రదర్శింప బడింది. అందుకనే చూచీ చూడటంతో చిత్రంగొప్పతనం గ్రహించడం చాలాకష్టం. ప్రేక్షకులు ఈ చిత్రమును చూచిన ఉత్తరక్షణంలోనే ఒక ఆనంద ఉన్మాదావస్థ నతిక్రమించి ఆధ్యాత్మిక తన్మయతలో ప్రవేశిస్తారు. ఇందులో అనేకమైన చిన్న చిన్న చిత్రణ నైపుణ్యాలు కనిపించినా అవి మొత్తం చిత్రం వల్ల వచ్చే ఆనందాన్ని మరుగు పరచవు. అత్యున్నతమైన భావనా శక్తి, భక్తి కలిగిన ఒక గొప్పమేధాశాలి ఈ చిత్రాన్ని భావించి చిత్రించి ఉంటాడు. అందుచేతనే దీనిలో ఒక ఆధ్యాత్మికానందము, సౌందర్యము తొణికిసలాడుతూ ఉంటాయి. ఇంతవరకు మనకు లభించిన పెద్దపెద్ద కుడ్యచిత్రాలలో నటరాజ చిత్రము రెండవది అని చెప్పవచ్చును. మొదటి చిత్రము గజేంద్ర మోక్షము. దీనిలో కనులు మిరిమిట్లుగొలిపే రంగులు అత్యద్భుతమైన అంగాంగభావము. ఆకృతులలోను, అవయవాలలోను కలిసిన సామరస్యం, తెరల సౌందర్య రేఖలచాంచల్యము మొత్తం చిత్రంలో ఉండేమార్దవము, సౌకుమార్యము, ఎంతో మెచ్చుకోదగి ఉన్నాయి.

ఇంకొకటి హరిహార కుడ్యచిత్రము. దీని పరిమాణము 4 అంగుళాల పొడుగు 1½ అంగుళాల వెడల్పు. దాక్షిణాత్య కుడ్య చిత్రాలలో ఇది అత్యుత్తమమైనది. దీనిలో హైందవ దేవతలలో మహావిష్ణువు, శివుడు కలియుగా ఏర్పడిన ఉత్తమ భావన ఉన్నది ఈచిత్రమును మొట్టమొదట చూచినప్పుడు శివుడు కుడి భాగములోను, విష్ణువు ఎడమ

భాగములోను ఉన్న ఒకటే ఆకృతిగా కనిపిస్తుంది. దీనిలో అంగాంగీ భావసమ్మేళనము అత్యద్భుతంగా వ్యక్తమైంది. ఇలాగే మరియొక అర్ధనారీశ్వర చిత్రంలో శివపార్వతుల ఆంతర సమ్మేళనము అత్యాశ్చర్యకరంగా ప్రదర్శింప బడింది. ఈ కుడ్య చిత్రాల నమూనాల రూపాలు పద్మనాభ పుర భవనంలో ఒక ప్రాచీన మహారాజు శయ్యాగారంలో ఉన్నాయి. ఈ పద్మనాభ పుర భవనంలో చెక్కడపు పని, కుడ్య చిత్రణము, శిల్పము, భవన నిర్మాణము అనే నాలుగు కళల అత్యుత్తమ సృష్టి కనిపిస్తుంది.

గోపికలు కృష్ణుడు అనే మరొక చిత్రణమున్నది. ఇది 4 అడుగులు 2 అంగుళాల పొడుగు, 3 అడుగుల 8 అంగుళాల వెడల్పు గల చిత్రము, దీని ప్రక్కనే శ్రీ రాముని కుడ్య చిత్ర మున్నది.

ఇవి రెండు పద్మనాభపుర ప్రాసాదంలో అత్యుత్తమమైన చిత్రాలు. శైలిలోను, పరిపూర్ణత్వము లోను వీటికివే సాటి. ఒక ఆధ్యాత్మిక ఔన్నత్యము వీటిలో అంతటా కనిపిస్తుంది. మనకు ఈ చిత్రాలు ప్రత్యక్షంతో కదులుతున్నట్లు ఉంటుంది. గోపీ, కృష్ణుల కుడ్య చిత్రంలో లతాపుష్పాల అలంకారాలు ముత్యాల అలంకారాలు, చాలా మనోహరంగా ఉంటాయి. ఇవి చూస్తే ఈ మహా చిత్రకారుల కళా నైపుణ్యము వెల్లడౌతుంది. ఈ కుడ్య చిత్రాల వర్ణాలు ఎంతో కన్నుల పండువుగా ఉంటాయి. ఈ చిత్రాలలో స్త్రీ, పురుషుల ఆకృతులు ఎంతో గంభీరంగాను గౌరవనీయంగాను కనిపిస్తాయి. ఇవి చూస్తుంటే మన కళ్ళ ఎదుట ఏదో ఒక గొప్ప నాటకం జరిగి పోతున్నట్లుంటుంది. ఈ పద్మనాభ పుర భవనంలో స్వల్పప్రదేశంలో 80 కుడ్య చిత్రాలున్నాయి. ఈ ప్రదేశాన్ని 'తిరువాన్నూరు అజంతా' అని పిలుస్తారు.

తిరువాన్కూరు కుడ్యచిత్రాలలో శిల్పుల నైపుణ్యము అత్యద్భుతం. వారి చిత్రాలలో ఆకృతుల ద్వారా ఆధ్యాత్మికాభిప్రాయాలను వ్యక్తీకరించడం అనితర సాధారణము. వీటిలో అంతటా సౌందర్యమూ, గాంభీర్యము వెల్లివిరుస్తూ ప్రేక్షకులను పరవశుల్ని చేస్తాయి. ఈ చిత్రకారులు ఊహాకల్పన లోను భావంలోను మహానిపుణులు. వీటిలో కేవలం నేత్రాల కంటె మేధా హృదయము ఆనందించే గుణాలు అధికంగా కనిపిస్తాయి. చిత్రకారులు చిత్రించేటప్పుడు దృశ్యశోభకోసం, అవయవపరిపూర్తికోసం

ఆసక్తి శ్రద్ధ చూపించలేదు. ఈ బొమ్మలలో అంతటా పురాణ గాధలే చిత్రింపబడి ఉన్నా ఇవి నేటి కాలపు సినీమాలకంటె కూడా ఎంతో ఆకర్షకంగానూ నీతిబోధకంగానూ ఉన్నాయి. ఇవి అన్నీ ౧౬ శతాబ్దం లోనివని అంటారు వీటి భావన రూప కల్పనలు అనితర సాధారణ మైనవి.

శ్రీ చిత్రాలయంలో ప్రదర్శింపబడిన కుడ్య చిత్రాలలో రాజరాజేశ్వరి, మన్మథుడు, గుఱ్ఱపు స్వారీ చేస్తున్న వృక్షదేవత, నారద ఋషి, సుబ్రహ్మణ్యస్వామి అలంకరించుకుంటూన్న ఒక సుందరి, అనే చిత్రాలు చాలా ముఖ్యమైనవి. వీటి మూల ప్రకృతులన్నీ పద్మనాభస్వామి దేవాలయంలో ఉన్నాయి. వీటిలో రూప భంగిమ, ధ్యాన గాంభీర్యము- అలంకార ప్రాచుర్యము అతి మనోహరాలు. రేఖా సౌందర్యం లోను, భావ పటిమలోను పరిపూర్ణ మాధుర్యాలోను, ఆధ్యాత్మిక భావనలోను వీటికివే సాటి. వీటి సౌందర్యము, ఆకృతి అతిసున్నితమైనవి, వీటిలో అవి ముఖ్యమైనవి. సుస్పష్టమైనవి, వీటి అలంకరణము, అలంకారాల గంభీరవర్ణాలు. అవిఒంటొంటిలో ఎంతో అనురూపంగా కనుపిస్తాయి. ఒకసారి ఈ చిత్రాలు చూస్తే స్మృతి ఫలకం మీద ఎన్నటికీ చెరిగిపోని ముద్రలు పడతాయి. వీటిలో కొందరు స్త్రీల ఆకృతులు అప్సరఃస్త్రీలను పోలి ఉంటాయి. ఈ కుడ్య చిత్రాలన్నీ వనస్పతి వర్ణాలలో చిత్రించారు. ఎంతకాలమైనా వీటిసౌందర్యమలాగే నిలిచి ఉన్న. మన పూర్వ గ్రంథాలలో స్త్రీల సౌందర్యము వర్ణింపబడినట్లుగానే ఈ చిత్రాల ఆకృతులు చిత్రించారు. ఈ కుడ్య చిత్రాలలో సుందరీమణుల కనుబొమ్మలు అర్ధచంద్రాకారంగాను, హృదయాలు వర్తులంగాను, జఘనాలు సుందరమైన నిమ్నోన్నతాలతోను, చిత్రించారు. మరిన్నీ సన్నని నడుములు, పొడవైన వ్రేళ్ళు వీటి ఆకారాలకు ఎంతో సౌందర్యం చేకూర్చాయి. చిత్రాల కంపని సుందరీమణుల సౌందర్యము ఈ కుడ్య చిత్రాలలో కనులకు మిఱుమిట్లుగొలుపుతూ మెరసిపోతూ ఉంటుంది. తిరువానక్కాడు కుడ్య చిత్రాలలో కనబడే స్త్రీలందరిలోను శక్తి, గాంభీర్యము, కళ్ళకు కొట్టుతూ ఉన్నట్లుగా ఉంటాయి. స్త్రీల ఆకృతులు ఇంత మనోహరంగా ఎక్కడా చిత్రించలేదు. కళలలో ఇవి అత్యున్నత శిఖరాలు, అందుకోకలిగాయి. ఈ చిత్రాలు చూస్తూ ఉంటే అవి కదులుతూన్న కవిత్వం లాగ మనని ఒక నూతన ప్రపంచంలోకి లాక్కుపోతాయి. ఇవి "మానస భావనా లతలు పూచిన మనోహర పుష్పాలు"

# గ్రంథ విమర్శనము

## నాయకురాలు :

కర్త వానిలాల సోమయాజులుగారు,

సాహితీసమితి, రేపల్లె, గుంటూరు. పేజీలు ౧౧౦, వెల రూపాయిన్నర.

ఇది పన్నెండు దృశ్యముల నాటకము. పల్నాటి వీరగాథ ఇందు వర్ణితమైన కథావస్తువు. ఇందు రసవంతమైన పాటలు పద్యములూ చొప్పించబడినవి. రచనలో విశిష్టత ఉన్నది. చదువుటానికెంత ఆకర్షకంగా ఉందో, ప్రదర్శించటానికి కూడా అంతరక్తి కట్టుతుంది. మనకీమధ్య వెలువడిన నాటకాలలో ఇది ఒక గొప్ప నాటకంగా మనం లెక్కించుకోవచ్చు. సోమయాజులుగారు స్వయంగా సారస్వతారాధకులు కావటం వల్ల నాటకంలో రచన చమత్కృతి కంటె, భాషా సౌష్ఠవం, భావ గాంభీర్యం యెక్కువగా కనుపిస్తాయి.

అయితే పాత్ర పోషణలో కొన్ని ప్రత్యేకతలు చూపించారు. నాగమ్మ (నాయకురాలి) చేత శివకీర్తనా, చండికా కీర్తనా చేయిస్తూ గంభీరంగా చిత్రించారు. కాని మహామేధావి, అనుపమ ప్రజ్ఞావంతురాలు అని బ్రహ్మన్నచే కొనియాడబడిన నాగమ్మను అక్కడక్కడ అహంకారిగానూ, వ్యర్థలాసిగానూ చేశారు. అలా కాక ఆమె పితృవధకి ప్రతీకార దీక్షతోనే కార్యభారం వహించి నిర్వహించిందని మరింత ప్రధానంగా చేసిఉంటే నాయకురాలి బ్రహ్మనాయుని మన్ననకు నిజముగా పాత్రమైయుండేది.

బ్రహ్మన్న పల్నాటి శ్రీకృష్ణుడని పేరుగాంచటం విదితమే. ఆయనరాజనీతి నిపుణుడు. ధీమంతుడు. దయాశీలుడు. ఓరిమిగలవాడు. బ్రహ్మన్నపాత్రను జాగరూకతతో ప్రధానపాత్రగా చిత్రించారు. అతడు ఆంధ్రవీరభారత యుద్ధంలో శ్రీకృష్ణుడిలా కర్త కర్తృకపోవడం సమంజసం. ఇదిఅతనిదయకీ, అహింసాపరతకీ తార్కాణం. కాని ఒక్కవిషయం సబబుగాలేదు. బ్రహ్మన్న అహింసాపాత దృఢత్వం తేదు. ధర్మరక్షణకంటే అతడహింసయే మేలనుకొన్నాడు. బాలచంద్రుడు మరణించినీ విజయం సంపాదించి వచ్చినప్పుడు బ్రహ్మన్న చేత, "బాలుడూ ... మహోత్కృష్ట కార్యంచేశావని సంతోషించమన్నావా? ఇదిమహాద్రోహం; అని గర్జించి పలుకుతాడు. ఇది కన్నమదాసూ సేనలని మాచెర్లో అన్న బ్రహ్మన్నకి తగదు. శ్రీకృష్ణుడు భారతంలో ఈ విధంగా మహావీరులని చేతకాని అహింసతో, హృదయ దౌర్బల్యంతో అవమాన పరచలేదే? కాగా' కుతస్త్వా కశ్మలమిదం? అని ప్రశ్నించి, యుద్ధమాతిష్ఠోత్తిష్ఠ భారత, అన్నాడు. బ్రహ్మన్న అటువంటి యోగీశ్వరుడు కావాలిగాని, చావసిద్ధంగా ఉన్న మహావీరునికి శాంతిలేకుండా పీడిస్తాడా? ఇది బ్రహ్మన్నకూ బాలచంద్రునకూ కూడ కళంకమే. దుర్యోధనవధ జరిపినకృష్ణుడూ, ధర్మరాజూ, భీముడూ కళంకితులయారా!

ఇందు శ్రీ శివశంకర శాస్త్రి గారికి అంకితమిస్తూ వ్రాసిన పద్యాలు, యింకొన్ని పాటలూ చక్కని ఖండకావ్యాలుగా సారస్వతంలోకి చేరగలవు.

అట్టివాటిలో' పొంగవే ఓ నాగువేరా, అనేదిఒకటి, అందరూచదువ దగ్గ కావ్యము. కాని పాఠకులు చరిత్రాత్మకమైన బాలచంద్రుడూ బ్రహ్మన్నలూ దీనిలోమార్పు చెందారని గుర్తించుకోవాలి.

సూరంపూడి భాస్కర రావు, ఎం.ఏ.

## సూర్య ప్రభ. దీపావళి సంచిక.

శ్రీ డాక్టరు అప్పారావు గారిచే ప్రకటింప బడు 'తరాన్న సూర్యప్రభ' వారి దీపావళి సంచిక నూతన శోభలతో శోభాయమానంగా వుందని, కేవలం అట్లైనే గాక ఇట్టి ప్రత్యేకసంచికలో లోపల కూడా కొన్ని త్రివర్ణచిత్రాలున్నచో యింకా బాగా ఉండి ఉండేదనిన్ని భావిస్తూ, అందలి మానాపాటి గాంధిగారి 'నా దేశమాత్రం పట్టులో' అన్న రచనా, అబ్బాసుగారి 'ఝండా' శివరామ కృష్ణగారి, 'వాత్సల్యం' అనువాదం అయినా, నీలకంఠం గారి 'పార్వతి' నన్ను బాగా ఆకర్షించాయనీ, దురభ్యాసాలలాంటి గత సంచిక తరువాయిలు ప్రత్యేక సంచికలలో వేయడం అనేది మన పత్రికాధిపతులందరూ చేస్తూన్నదే అయినా ప్రత్యేకసంచికలు ప్రత్యేక సంచికలుగానే ఉంచి వాటిలో గత సంచిక తరువాయిలూ, సశేషాలు లేకుండా ప్రత్యేక సంచికలు వేసే ఆంధ్రపత్రికాధిపతులూ సంపాదకులూ గమనించిన బాగుంటుందనీ, డైమ బిజినెసు లాంటి కథలు అట్టి వ్యాపారస్థులకే వదలి పత్రికలలోనికి రాకుండా చేస్తే మంచిదేమోననీ, విన్నవిస్తూ శ్రీ అప్పారావుగారు తమ ప్రత్యేక దీపావళి సంచిక ద్వారా పాఠకుల మన్ననలంది ఇట్టి ప్రత్యేక సంచికలు సాలునకు రెండు మూడు సార్లయినా వేస్తారని ఆశించుచున్నాను.

“బసవ”



# డాక్యుమెంటరీ, విద్యావిషయిక చలనచిత్రాలు !

## ప్రదర్శనానికి సిద్ధంగా ఉన్నాయి !

౧ పురాణ కాలంనుంచి అమల్లో ఉన్న నేటి

మన పింగాణీ పరిశ్రమ.

ప్రపంచకంలోకెల్లా ఈ విషయంలో తయారయి ఉన్న ఫిల్ము ఇదొక్కటే

౨ జపాను దేశపు చేతి కాగితపు పరిశ్రమ

౩ జపాను దేశపు బొమ్మల పరిశ్రమ,

౪ శ్రీ శరత్ బాబుచే తెరువబడి ఆశీర్వదించ బడిన

అఖిల భారత పారిశ్రామిక కళా ప్రదర్శనము.

[ ఇందు పాల్గొనిన వివిధ వస్తు ప్రదర్శన శాలలు, చిత్రకళా ప్రదర్శనము, నాటకములు, భరత నాట్యములు, పాటకచేరీలు వగైరా చూడనగును ]

వివరములకు :—

## "శిల్పి ప్రచురణాలు."

ఫిల్ము శాఖ.

౧౦, నరసింగ పురంవీధి, మౌంట్ రోడ్, మద్రాసు.

# వివేకానంద ఇండస్ట్రియల్ ఇంజనీర్స్

## పెరంబూరు, మదరాసు.

ఎలక్ట్రికల్

డిజైన్లు—కట్టడములు

*  *  *

బంగాళాలు, సినిమాలు, ఫాక్టరీలలో, ఇంజను ఫిట్టింగులు దీపాలు ఏర్పాటులు.

*  *  *

కోల్డుస్టోరేజి, ఫ్రిజిడేరీలు

*  *  *

గ్రామసీమలలో విద్యుచ్ఛక్త్యేర్పాటులు

*  *  *

అన్నిరకాల మోటార్లూ, జనరేటర్లూ మరమ్మతు చేయబడును.

*  *  *

ట్రాన్సుఫారమర్లూ, స్విచ్ గియర్లూ సప్లయి చేయబడును.

మెకానికల్

రిపేరీలు—తయారీలు

చేతి-మర-మగ్గములు నూలుయంత్రాలు అంటే వైండింగ్, వార్పింగ్, సైజింగ్ మెషినులు మొదలయినవి.

*  *  *

చేతికాగితపు గ్లేజింగు, వగ్గరాయంత్రాలు.

*  *  *

బియ్యము, పింజె, నూనె, పంచదార, మరల బాయిలర్లు, స్టీముఇంజన్లు, పంపులు

గ్యాస్ ఆయిలు, ఇంజన్లు, వర్కు-షాపు పనిముట్లు, టూసరీయంత్రాలు.

ఉక్కు, బీడు, ఇత్తడి, కంచు వగైరా కవచలోహములలో మీకు కావలసిన ఏ ఇంజను సామాన్లయినా సరిగా సకాలమునకు పోతపోసి తయారుచేసి ఇవ్వగలము, సరసమయిన చార్జీలు! నికరమయిన పనివాడితనం. !

ప్రొప్రయిటరు,

**టి. సి. యస్. ఆచారి.**

# మైలాపూరు, చెన్నపురి శ్రీరామ కృష్ణ మఠ స్వర్ణోత్సవము

ఈ స్వర్ణోత్సవ స్మారకార్థము ప్రకటనశాఖ ఆంధ్ర, ఆంగ్ల, తమిళ భాషలలో స్వర్ణోత్సవ సంపుటములు, మొత్తము మూడు రూపాయలకు పైబడినట్లు కొనువారికి ఒంటరిగను 1-1-1948 నుండి 31. 3. 1948 వరకును 12½ పెర్సెంటు తగ్గించి యివ్వబడును.

మఠమునకువచ్చి ఈ పుస్తకములను పై నియమిత కాలమున కొనువారికి యిరువది పెర్సెంటు తగ్గించి యివ్వబడును.

**తెలుగు పుస్తకములు:—**

| | రూ. |
|---|---|
| శ్రీ వివేకానంద లేఖావళి | |
| మొదటి భాగము | 1/8 |
| రెండవ ,, | 1/8 |
| శ్రీ వివేకానంద జీవిత చరిత్ర | 2 |
| శ్రీ శారదా దేవి జీవిత చరిత్ర | 1/12 |
| శ్రీమద్భగవద్గీతా (శ్రీధరీయ వ్యాఖ్యాన సహితము) మేలుప్రతి | 3/8 |
| ,, సాధారణ ప్రతి | 1/8 |
| భక్తియోగము | 1 |
| భక్తి మార్గము | అ. 8 |
| గురూపదేశములు | ,, 8 |
| నా సంస్కరణ యొక్క విధానము | ,, 6 |
| నవీన భారతము | ,, 4 |
| నా గురుదేవుడు | ,, 6 |

**English—**

| | Rs | A. |
|---|---|---|
| Gospel of Sri Ramakrishna | 20 | 0 |
| Prince of Ayodiya— | | |
| Calico | 6 | 0 |
| Board | 4 | 0 |
| Tales and Parables of Sri Ramakrishna | 3 | 8 |
| God and Divine Incarnations | 2 | 4 |
| Atmabodha | 4 | 0 |
| Master and Disciple | 2 | 0 |
| Inspired Talks Calico | 3 | 0 |
| Limp | 2 | 0 |
| Eternal companion— | | |
| Calico | 3 | 4 |
| Board | 2 | 4 |
| Srimad Bhagavadgita (English translation only) | 2 | 12 |
| Sri Ramakrishna His Unique Message | 2 | 0 |
| Divine Life | 2 | 4 |
| Universal Prayers | 1 | 12 |
| Hinduism | 1 | 0 |
| Education | 0 | 12 |
| Thus Spake Vivekananda | 0 | 6 |

టెలిఫోన్ : 3648 టెలిగ్రాము : Betelnut

# ఆనంద ప్రదర్సు

## ఉత్పత్తిదారుల ఏజంట్లు - సరఫరా చేయువారు.

334, తంబుచెట్టి వీధి, జి. టి. మదరాసు.

ఈ క్రింది కంపెనిలకు మేము ఏజంట్లుగా ఉంటున్నాము.

| | | |
|---|---|---|
| ఆంధ్ర పేపరు మిల్సు లిమిటెడ్ | ... | రాజమండ్రి |
| బెంగాల్ బెల్టింగ్ వర్క్సు లిమిటెడ్ | ... | కలకత్తా |
| పైరితూరమ్ ప్రోడక్ట్సు (ఇండియా) లిమిటెడ్ | ... | కలకత్తా |
| డ్రగ్ హౌస్ (ఇండియా) లిమిటెడ్ | ... | కలకత్తా |
| మాయా ఎంజినీరింగ్ వర్క్సు | ... | కలకత్తా |
| రిలయన్సు ఇన్స్యూరెన్సు అండుకో లిమిటెడ్ | ... | కలకత్తా |

బెంగుళూరు ఆఫీసు

మైసూర్ బ్యాంక్ బిల్డింగ్సు, ఎవిన్యూ రోడ్డు.

బొంబాయి
బీమన్ ఛేంబర్సు మెడోస్ట్రీటు (ఫోర్టు)

షోలాపూర్
వార్డుబిల్డింగ్ చాత్రగల్లీ

బెజవాడ
9/315 రంగనవారి వీధి

సికింద్రాబాద్
8091 కింగ్సువే

షిమొగా
టౌన్ రైల్వేస్టేషను దగ్గర

కోయంబత్తూరు
21/138 రంగేగౌండర్ స్ట్రీట్

మైసూరులోను, బీజాపూరులోను డిపోలు ఉన్నాయి.

ఇది నెం. ౪౦, ఆయలూరి ముత్తయ్యా మొదలి వీధి, శ్రమజీవి ప్రెస్సు లిమిటెడ్ లో శ్రీమాన్ సి. ఎస్. ఆచార్య గారిచే ముద్రింపబడి, 10, నరసింగపురం వీధిలోని ఆంధ్రశిల్పి కార్యాలయంలో శ్రీ దిగుమర్తి సాంబశివరావు గారిచే ప్రకటింప బడినది. సంపాదకులు : శ్రీ. గణపతి శాస్త్రి : శ్రీ. సాంబశివరావు




ఆంధ్ర, రాయలసీమ, హైదరాబాదు మండలాలకు సబ్ డిస్ట్రిబ్యూటర్సు.
చమ్రియా టాకీ డిస్ట్రిబ్యూటర్స్ : బెజవాడ.




★

తారాగణం

వరలక్ష్మి

లక్ష్మిరాజ్యం

ప్రకాష్

ప్రసాద్

ప్రభాకర్

రాళ్ళబండి

శివరావు

★

!!!

డైరెక్టరు.

ప్రసాద్

!!!


ప్రొడ్యూసరు

ప్రకాశరావు

FOR PARTICULARS.

| | |
|---|---|
| ANDHRA & CEADED Dts. | MYSORE & COORG |
| PREMIER FILMS LTD, | RAGHAVENDRA PICTURES |
| BEZWADA | BANGALORE CITY. |

# పరిష్కారమైంది! — మన ఆహార సమస్య





పరిశోధనలవల్ల తెలుస్తున్న దేమంటే మనశరీర నిర్మాణానికి అవసరమైన ప్రొటీన్లు, పోషక విటమిన్లు, దాతుపుష్టినిచ్చే క్రొవ్వు పదార్థాలు పిండిపదార్థాలు లోపంలేకుండా వుండాలి.

దిన దినాహారంలోని యీలోపాలు తీర్చుటకొరకై పుటంవేసి ముందుగ జీర్ణింపించి తయారుచేసిన ప్రొటీన్లు, ఖనిజలవణాలు, విటమిన్లు మొదలైనవాటి మిశ్రసారము ఆహారముతోపాటు పుచ్చుకొనుట అవసరమని శాస్త్రజ్ఞులు తెలుసుకున్నారు.

హిందూదేశమున పెద్దలు, పిన్నలు ఆరోగ్యముతో అభివృద్ధిపొంద దానికై యీశరీరరక్షణాహారాలను తయారు చేయుటలో మెక్ లెక్ వారే ప్రధములు. ప్రత్యేకశాస్త్రవేత్తలు వీరితయారువస్తువులనుపరీక్షించి అవి సమపాలనంగా లేనిమనఆహారలోపాలను తీరుస్తాయని ప్రకటించారు.

<u>మెక్ లెక్ ప్రొటీను ఆహారము</u>, వయోవంతులకుగాను పుటముచేసి ముందుగ జీర్ణింపించి తయారు చేసిన ప్రొటీను పదార్థము.

<u>మెక్ లెక్ శిశు ఆహారము</u>: పైవిధంగానే శిశువులకు అవసరమైన పదార్థము.

<u>మెక్లోవిట్సు</u>: వయోవంతులకు అవసరమైన మల్టి విటమిను బిళ్లలు.

<u>సిరప్ కాల్సిఫాల్</u>: శిశువులకవసరమైన మల్టివిటమిను సిరప్.

<u>టొనికెన్ మరియు హెప్టాకైన్</u>: బలహీనులకిది ముఖ్యము.

సమపాలనాహార విధానమును తెలిపే వాఙ్మయము మాకు వ్రాసిన ఉచితముగా పంపబడును


DIET

**మెక్ లెక్ న్యూట్రిమెంట్సు**

మీ ఆహార పదార్థాలను సమపాలనంచేయును

ది మెక్ లెక్ న్యూట్రిమెంట్సు అండ్ ఫార్మస్యూటికల్సు, లిమిటెడ్,
99-A, ఆర్మీనియన్ స్ట్రీటు, జి. టి. మద్రాసు

MNP. 43 Telugu.


The
STAR
of India Pencils
THE PENCIL FOR ALL
THE MADRAS PENCIL FACTORY MADRAS